కలలే ఫలించినా....

'ధనిష్ఠ'

పేవ్ మెంట్ మీద నడుస్తున్న మధుపక్కనే, పేవ్ మెంట్ ని తాస్తూ కారొకటి ఆగి కీచుగా ఎలక్ట్రిక్ హారన్ మ్రోగింది. ఉలిక్కిపడిన మధు సహజ కౌతుకంతో కారువేపు దృష్టి సారించాడు నిలబడిపోయి. వెనకసీటు తలుపుపక్కకి జరిగి తలబైటకు పెట్టిందో అప్సర. "మీ పేరు మధు కదూ?—" తేనె లొలుకుతూ పలికింది. ఆ ప్రశ్న మధు మతిని పోగొట్టేసింది. ఎవరీమె? తన పేరు యీమెకెట్లా తెలుసు? ఇంతకీ అది తన పేరేనా? లేక తాను కలకంటున్నాడా ఈగ యిల్లలుకుతూ పేరు మర్చిపోయిందిట! మధుకి నిజంగానే తన పేరు మధానని నమ్మకంపోయింది. ఎటూ తేలని ఆలోచనలలో కొట్టుకుంటూ ఆ ప్రయత్నంగానే "కాదు" అన్నాడు. ఆ జబాబు ఆమెను ఆశ్చర్యపరిచేబదులు నవ్వించింది. "మార్చుకున్నారా? అంది నోరార నవ్వుతూ. అనూహ్యమైన ఆసంఘటన మధు మెదడు స్తంభింపజేసింది—

"లేదు" అన్నాడు మరో ప్రపంచంలోంచి— ఏం మాట్లాడుతున్నాడో తెలియకుండానే—

"మీ పేరు మీరు మర్చిపోయినా నాకు జ్ఞాపకం ఉందిలెండి. రండి లోపలకి—తరవాత ఆలోచిద్దురు గాని-ఆలశ్యమైతే జనం మూగుతారు" — పట్టలేని ఆనందంతో వికసిస్తున్న ముఖంతో—అంది.

అంత ఆప్యాయంగా ఒక అపురూపసుందరి ఆహ్వానిస్తూంటే—పోనీ అదికలే అయినా కొంతసేపు సాగనీ—అనుకుని తలుపు తెరుచుకొని ఆమె అటు జరిగి చేసిన కాళీలో కూలబడ్డాడు.

తలుపు మూసుకోగానే కారు కదిలి సెకండ్ల మీద వేగాన్ని వృద్ధిచేసుకుని ట్రాఫికని దూసుకుంటూ సాగిపోసాగింది.

గట్టిగా కళ్లు మూసుకున్నాడు మధు. తెరిస్తే కల చెదిరిపోతుందేమోనని భయం వేసింది! ఊహాలోనైనా ఆ అనుభవం ఎక్కువసేపుంటే బాగుండునని పించింది!

"ఏం చేస్తున్నారిప్పుడు?" ఆ ప్రశ్న అతనికళ్లు తెరిపించింది.

దృశ్యం చెరిగిపోతుందనుకున్నాడు గాని చెరగలేదు. ముందు కార్లని తప్పించుకుందుకు హారన్ మ్రోగుతోంది. డ్రైవర్ ముందున్న అద్దంలో వెనకాల కార్లు కనిపిస్తున్నాయి — సడెన్ గా పల్లంలో పడ్డ కుదుపును అణిచివేసేంత మెత్తని సీటుమీదున్నాడతను. పక్కకి తిప్పాడు ముఖం — అత్యధికమైన సంతోషంతో ఉజ్జ్వలంగా దీపిస్తున్న ఆ ముఖం తానెక్కడో చూచినగుర్తు మధుకి — చాలాసార్లు— చాలారూపాలలో చూశాడు తను — ఎక్కడ — ఎక్కడ — వాల్ పోస్టర్లమీద — సినిమాల్లో — సినీతార తపతి కదూ ?

"ఇప్పటికైనా తెలివిలోకి వచ్చారా ?" — పరిహాసపూర్వకమైన ఆ మాటలు మధుకి చిర్రెత్తించాయి —

"డ్రైవర్ కారాపు —" అరిచాడు.

"కణ్ణా — ఆపకు —"

"ఏమిటీ జబర్దస్తీ ?" విసుగ్గా ప్రశ్నించాడు మధు.

"అంత కోపమైతే ఎల్లాగస్వామీ ? — అయినా నిజం చెప్పండి — ఆపేస్తే దిగిపోతారూ ?— కనీసం బాధపడకుండా — మీతత్వం నాకు తెలీదూ — ఇల్లాగే జరిగితే బాగుణ్ణని కదూ అసలు మీరనుకుంటారు ? — నా కళ్లల్లోకి చూసి చెప్పండి—" చెంపకు చారెడున్న ఆమెకళ్లు చిలిపిగా నవ్వుతున్నాయి—

ఇదో చిన్న సైకలాజికల్ బ్లఫ్— ఆపరిస్థితిలో ఆ మాటలు ఎవర్ని అడిగినా కాదు, అవును, అనలేని స్థితిలోనే ఉంటారు — తపతి అంత తార ఆప్యాయత ఒలకబోస్తూ ఎంతో సన్నిహితంగా యీ ప్రశ్న వేస్తే నూటికి తొంభైతొమ్మిదిమంది తలక్రిందులౌతారు — జీవితంలో ఏదో క్షణంలో అటువంటి కోరిక ప్రతీవారిలోను ఉత్పన్నమౌతుంది.

చాలా కటువుగా ఉన్నా — ఆనగ్న సత్యం అతన్ని చిత్తుచేసింది. సిగ్గు ముంచెత్తింది — ముఖం

ఎర్రబడిపోయింది - అదికలే అయినా కొంత పొడుగ్గా ఉంటే బాగుణ్ణని కదూ తాననుకున్నది! — అంతకు ముందు, ఏ తారేనా పెళ్లాడకూడదా అనికదూ బాధ పడ్డది?

మళ్లీ మొదటి ప్రశ్న ఎదురైంది.

తనీమెకెల్లా తెలుసు?

అదే అడిగాడు.

"ఆ మొహం చెప్పటంలా! —" సమ్మోహితం చేసే మందస్మితంతో కావాలనే వేళాకోళంగా అందీమాట.

ఈ మాటు యీ మాటలుకోపం కలిగించడానికి బదులు గిలిగింతలు పెట్టాయి మధుని... ఆమె తన్నెగుగున్నానంటోంది. అంత అదృష్టం తన్ను వెన్నంటి వస్తుంటే తాత్కాలికంగానైనా ఆనందించక కోపం దేనికి — ఇదీ బాగా నేఉంది అనుకున్నాడు.

"నేనస్సలు గుర్తు రావటంలా మీకు? —" ముద్దుమూతి పెట్టి అడిగింది.

"ఒకలా గుర్తుకి రానేవచ్చారు. మిమ్మల్ని తెర మీద చూశాను. గోడలమీద చూశాను," సందు దొరికి నప్పు డెందుకు వదలి పెట్టాలని విసిరాడు మధు.

"అలా కనీసం కొన్నిలక్షలమందికి తెలుసు నేను. అది సరేగాని నన్ను మీరు మీరనడం బాగులేదు— ఊహు — కారణాలు చెప్పొద్దు — నన్ను నువ్వనే హక్కు మీకిస్తున్నాను—అది ఉపయోగించుకోండి-"

"నిన్ను నువ్వనేహక్కు యిచ్చానంటున్నావు గనక నువ్వే అంటాను. నాభావాలని చదివేశావు— నన్ను గుర్తించానంటావు—అపారమైన ప్రేమ ఒలక బోస్తున్నావు—కలె నేమోననే భ్రమ యింకా వీడిపో లేదు నన్ను—కనీసం యీ నాటకం ఎందుకు ఆడుతు న్నావో — ఎప్పుడు అంతమౌతుందో కూడా చెప్పెయ్యి—"

"మీరు వద్దనుకున్నప్పుడు—కాని యిది నాట కం కాదంటే నమ్ముతారా?"

"అయితే నువ్వెవరవో చెప్పు."

"అయితే పోల్చుకోలేరన్నమాట!—పోనీ ఆలో చించి చూడండి. అప్పుడూ అంతే అయితే ఎల్లాగూ తప్పదు.—సస్పెన్స్ అంటే మా ప్రొడ్యూసర్స్ పడి ఛస్తారు—నాకూ అదే అలవాటయింది. నిజమూ అంతే ననుకోండి — పిడికిలి తెరిచేస్తే ఓసి యింతేనా అంటారు—"

"అయితే నువ్వు కాస్సేపు మాట్లాడకుండా కూర్చో—" ఆమె మాటల్లో తొణికిసలాడిన ఆత్మీయత అతన్ని పురిగొల్పింది.

"అమ్మయ్య — యిప్పటికి వీడినట్టుంది మత్తు. అసలు ధోరణిలో పడ్డారు."

మధు ఆలోచనలకి ఉపక్రమించాడు. ఎవరమె? ఎక్కడ చూశాడు తను—ఎంతసేపూ తెరా, పోస్టర్లూ, వివిధ భంగిమలతో, భావాలతో, గోచరించే వదనమే సాక్షాత్కరిస్తుంది గాని అదివరలో ఎరుగున్న గుర్తు రాదు. పోనీ ఆ మాటలతీరు, ఆమె చేష్టలు—వాటిలో ఏదీ ఆమె అసలు తత్వాన్ని పట్టివ్వడంలేదు. కారణం ఆమె నటి—వివిధ పాత్రల నభినయించిన అనుభవం ఆమెకు ఏభావాన్నైనా చేష్టలనైనా ప్రదర్శించే నేర్పు నిచ్చింది—ముక్కు మొగం ఎరగనివాడితో ముప్పైఏళ్ళ పరిచయం ప్రకటించగలదు. ప్రేమ నటించగలదు. జీవితాన్నే నటించడం నేర్చుకుందేమో.

మధు ఊహాస్రవంతిలో మునిగి తేలుతూండగా కారు ఒక పెద్ద కాంపౌండ్ ముందు ఆగి, గూర్ఖా తలుపు తియ్యగా మెల్లిగా లోపలకి చొచ్చుకుపోయి పోర్టికోలో ఆగింది.

"దిగుతారా మహాత్మా!" అంది తనవైపు తలుపు తెరుచుకుని దిగుతూ.

మధు దిగాడు. మొజాయిక్ గచ్చుచేసిన వీధి వరండా గడిచి హాల్లోకి వచ్చారు. హాలు మధ్యగా అత్యంత సుందరంగా ఉన్న చేపలతోను, నాచుతోను ఉన్న ఎక్వేరియం. ఖరీదైన ఫర్నిచర్. కుడిపక్క గది లోంచి మెట్లు. మేడమీదకి బాల్కనీ. పై హాలులోకి అంతమైనాయి మెట్లు. నేలంతా ఖరీదైన కార్పెట్లు పరిచి ఉన్నాయి. పోర్టికో మీదకి బాల్కనీ. అక్కడ ఒక చిన్న రౌండ్ టేబిల్ చుట్టూ రాకింగ్ ఛైర్స్. లతలకమ్ములు అమర్చిన పెద్ద కిటికీలు--వాటికి తెరలు— ఫ్లవర్ వాజ్ డోమ్స్‌లో అమర్చబడి కళ్లలోకి సూటిగా వెలుతురును పంపని దీపాలు. హాలులోంచి కుడిపక్క తలుపు తెరిచిన తపతితో మధు కూడా వెళ్లాడు.

అది ఆమె శయనాగారం: రోజ్ ఉడ్ డబుల్ కాట్ —పైన దట్టమైన డన్‌లపిల్లో ఫోమ్ రబ్బర్

డబుల్ బెడ్—ఖరీదైన దుప్పటి—రెండు ముఖమల్ దిళ్లు—తలవేపు కుడిపక్కకి 'S' ఆకారంగా ఉండే బెడ్ సైడ్ టేబిల్. ఒక పక్కకి గోడలోకి అమర్చబడ్డ వార్డ్ రోబ్-ఆపక్కనే ఒక డ్రస్సింగ్ టేబిల్-మూడు బింబాలు చూపించే నిలువుటద్దం—టేబుల్ మీద తీరుగా అమర్చిన వివిధ రకాల కాస్మెటిక్స్. గోడలకు వివిధ భంగిమలలో ఉన్న తపతి ఫొటోలు—ఖరీదైన పెయిన్‌టింగ్స్ ప్రకృతిని చిత్రించేవి. ఒక్క ముక్కలో చెప్పాలంటే—డబ్బుమీద ఉండే నిర్లక్ష్యతని అంగుళం అంగుళాన్న చాటుతోందా యిల్లు.

మధుకి మరోసారి మతిపోయింది. ధనంతో ఇంత భౌతిక సౌఖ్యాన్ని కొనవచ్చునన్నది మొదటి సారిగా గోచరమైందతనికి. "కూర్చోండి—ఒక్క నిమిషంలో వస్తాను." అంటూ తపతి కుడిపక్కకు ఉన్న పెద్ద ఒంటి అద్దం బీరువా తలుపు తెరిచి లోపలకి అదృశ్యమైపోయింది. తపతి మాటలకు ఉలిక్కిపడిన మధు యిది చూసి మరింత ఆశ్చర్యపోయాడు. ఎటాచ్‌డ్ బాత్ గాబోలు!

మంచంమీద చతికిలపడ్డాడు మధు. ఒక్కసారిగా కిందకు కూరుకుపోయి మళ్లీ లేచాడు. ధనవంతుల మీదుండే అసూయాగ్ని ఒక్కసారిగా ప్రజ్వరిల్లింది మధు మనస్సులో. వాళ్ళ విచ్చల విడిగా అర్థం పర్థంలేని పనులలో వెచ్చించే డబ్బుతో ఎన్ని బీద కుటుంబాలు నిశ్చింతగా వెళ్లిపోతాయ్!—వీరి యీ దుబారాని అరికట్టి ఆ ధనాన్ని బీదలకు పంచే ప్రయత్నం ప్రభుత్వం ఎందుకు చెయ్యదు? ఇంతలో ఒక ఊహ వచ్చి అతని గుండెల్లో బల్లెంగుచ్చింది--అరగంట క్రితం తననుకున్న వేమిటి? యీ భౌతిక సౌఖ్యాలన్నీ పొందాలనే కదూ?—నిజంగా ఇప్పుడు మాత్రం తనకివన్నీ ఉంటే త్యజించి బీదలకు పంచిపెట్టగలడా తను!

ఇన్ని సౌఖ్యాలమధ్య కొట్టుకుంటున్న యీ ధనవంతుల కింకా హృదయం ఉందనేచెప్పాలి—ఎప్పుడో తన్నెరుగున్నానంటున్న యీమె యింత ఉన్నత స్థితిలో, తన (మధు) స్థితికీ ఆమె స్థితికీ యోజనాల వ్యత్యాసం ఉన్నాకూడా, తన్ని గుర్తించి ఆదరించింది.

లేక కేవలం యిదంతా ఒక నాటకమా?—ఒక సామాన్యుణ్ణి దిగ్భ్రాంతిలో ముంచాలనే వెర్రికోరిక కలిగి యిల్లా ప్రవర్తిస్తుందా? లేక ఎంతసేపూ ధన పూరితమైన నావావరణంలో చరించే యీమె రిలీఫ్ కోసం ఒక సామాన్యుడి పరిచయం వాంఛిస్తుందా?—ఏమిటి తనఊహ లిలా పోతున్నాయ్—పైవే కారణాలయితే తనపే రామె కెల్లా తెలుస్తుంది?—యీమెను తనెన్నడో ఎరుగుండి ఉండాలి—ఆడవాళ్ల జ్ఞాపకశక్తి, సంఘటనలని గుర్తించుకోడంలోని వివేకం అధికం కావడంవల్ల తానామెకు జ్ఞాపకం ఉన్నాడు.—ఈమె నెక్కడ చూశాడో—ఎంత తన్నుకున్నా ఆమెను తారగా చూసిన జ్ఞాపకమే యితర స్మృతుల్ని మరుగు పరుస్తోంది.

"పాపం! ఎంత ప్రయత్నించినా గుర్తుకి రావటం లేదుకదూ?—" హేళనా మిశ్రమమైన ఆమె నవ్వు మధు ఆలోచనలకి భరతవాక్యం పలుకుతూ, మధు పక్కనే చతికిలబడింది.

"నువ్వెంత హేళనచేసినా సరే, నిజంగానే గుర్తుకి రావడంలేదు—బహుశః నిన్ను తారగా ఎరిగి ఉండకపోతే చప్పున గుర్తుకి వచ్చిఉండును." అన్నాడు మధు.

"అయితే నా పూర్వాశ్రమనామం కల్యాణి అంటేమాత్రం మీ కేం తెలుస్తుంది?" తల ఊగిస్తూ ఆమె అడుగుతుంటే దీపాలకాంతికి ఆమె రవ్వల దుద్దులు తళుక్కున మెరుస్తున్నాయి.

కల్యాణి పేరు వినగానే మధు మనోవీథిలో చటుక్కున ఒక్క మెరుపుమెరిసి అంతలో అంతర్ధానమైపోయి అంధకారం అలుముకుంది. ఆ పేరెక్కడో తాను విన్నాడు. జ్ఞాపకం వచ్చినట్టే వచ్చి చటుక్కున జారిపోగానే అమితమైన బాధకు గురి అయ్యాడు మధు. జుట్టు పీక్కోవాలన్నంత యిది పుట్టుకొచ్చింది. కనుబొమలు ముడివడి ముఖంమీద దీర్ఘాలోచనా సహాయతాముద్ర వేసుకున్నాయి. తపతికి జాలివేసింది—తన్ను గుర్తించలేకపోయాడే అని బాధ వేసింది. అయినా చెప్పకూడదనే పట్టుదలవల్ల—

"పోనీ యింకోపని చేస్తాను. ఒక్కక్షణం ఆగండి—"అంటూ డ్రస్సింగ్ టేబిల్ ఎడంవైపు అట్టడుగు సొరుగులోంచి కార్డుసైజ్ ఫొటో ఒకటితీసి మధుకి అందించి "యిది చూసినా గుర్తుకి రాకపోతే నా ఖర్మ!" అంటూ నుదురు చేత్తో కొట్టుకుని వేళాకోళంగా నవ్వుదామని విఫలురాలైంది.

పదిహేను పదహారేళ్ల అమ్మాయిదాఫోటో—కోల మొహం-పెద్దవాలు గన్నులు-పలుచని బుగ్గలు-బుగ్గలు

మరీ పలుచనకావడంతో కొద్దిగా ఎత్తుగా కనబడే చిన్ననోరు-చక్కని ముక్కు. అమాయికత ఉట్టిపడు తూండా ముఖంలో - పట్టులేని ఆశ్చర్యం ప్రతిబింబించింది మధుముఖంలో. తపతిని ఆపాదమస్తకం పరిశీలించాడు.

కండపట్టడంచేత గుండ్రంగా తయారైనముఖం-పూడిన బుగ్గలవల్ల సమంగాఉన్ననోరు-ఆమెకళ్లలో అంతఅందమూ ఉంది గాని యిదివరకటి చిన్నముఖంలో కనబడ్డంత పెద్దవిగా కనబడ్డంలేదు. కొంతెనవ్వుతోను, అనుభవాలు ప్రసాదించిన విజ్ఞానవికాసాలతోను అలరారే ఆమె యిప్పటి ముఖానికీ అప్పటి ముఖానికీ పోలికలు చాలాతక్కువ. నలుపుకుమొగ్గే చామనచాయ, సామాన్యపు దుస్తులు-తాను మనిషిగా ఎరుగున్న కల్యాణి ఫోటోలో అంత అందంగా ఉంటుందని తనకి అనిపించనేలేదు. శ్రద్ధతీసుకుని అలంకరించుకుంటే అప్సరసలా ఉంటుందన్నఊహ అసలే రాలేదు.

"నమ్మలేనంతమార్పు వచ్చిందినీలో—"కొద్దిగా తేరుకుని అన్నాడు.

"అందుకే మీరు గుర్తుపట్టలేక పోయినా బాధపడలేదు నేను—కాని మీరు నాటికీ నేటికీకూడా ఒక్కలాగేఉన్నారు. అరమైలు దూరంనుంచిగూడా గుర్తించగలనేమో మిమ్మల్ని—"

శూన్యదృక్కుల్తో తనకేసి చూస్తున్న మధు తన మాటలు వినడంలేదనీ, జీవితగ్రంథంలోని పాతపుటలు తిరగవేస్తున్నాడనీ గ్రహించిన తపతి తానూ పూర్వపు సంఘటనలని నెమరువేసుకోవడంలో నిమగ్నురాలైంది.

ఎప్పటికల్యాణి !

మధు గతంలోకి ఎనిమిదేళ్లు ప్రయాణించాడు. తెరమీదికి ప్రొజెక్టుచేసిన సినిమారీలులా తన రెటీనామీదకి ఒక్కటొక్కటిగా ఆనాటి సంఘటనలు ప్రతిబింబిస్తున్నాయి.

అవి తన బియ్యే ఆఖరిసంవత్సరపు చివరిరోజులు. మాంబళంలో ఒకచిన్నయింట్లో ఒకరూం అద్దెకుతీసుకుని ఒకరిజోలి శొంఠీ అక్కర్లేకుండా మెలిగేవాడు. పక్కవాటా ఖాళీకావడం, అందులోకి మళ్లా ఒక పదహారు వసంతాల పడుచు, ఒకనడికారు స్త్రీ ప్రవేశించడం లీలగా తెలుసు తనకి—పరీక్షలు దగ్గిరికి వచ్చినకారణంగా వాళ్లెవరో, ఎందుకు వచ్చారో తెలుసుకోవాలనే కుతూహలంకూడా ఉత్పన్నంకాలేదు తనలో.

ఒకసాయంత్రం తాను వీధిలోకి బైలుదేరిబోతుండగా ఆనడికారు స్త్రీ వచ్చి "బాబుగారు ఒక చిన్న ఉపకారం చేసిపెడతారా ?" తెలుగులో అడిగింది.

"ఏంకావాలి ?" అడిగాడు తను కాస్త విస్మితుడయి.

"అమ్మాయికి రెండురోజులనించి జ్వరంగా ఉంది. అదేతగ్గుతుందని ఊరుకున్నాం గాని యివాళ మూసినకన్ను తెరవకుండా పడిఉంది. మాకీభాష రాదు—కాస్త డాక్టర్ని పిలిచి—"

"అల్లాగే తీసుకువస్తాను."

"తరవాత—" తటపటాయించింది.

"చెప్పండి"

"ఈ గాజు కొంచెం అమ్మిపెట్టాలి." గతుక్కుమన్నాడతను. తనకటువంటివి అనుభవంలో లేకపోవడమే కాక భయంగూడాను.

"ఉంచండి. డాక్టర్ని నేను తీసుకువస్తాను." అన్నాడు అతను.

"కాదు బాబూ యిది అమ్మేతీరాలి—"

"అది తరవాత చూద్దాం లెండి. ముందు డాక్టర్ని తీసుకువస్తాను పదండి." అని ఆమెను పంపించి తను డాక్టర్ నిమిత్తం వెళ్లాడు.

డాక్టర్ని తీసుకుని మొదటిసారిగా వాళ్లవాటాలో అడుగుపెట్టాడు. వీధిగదిలో కిందపరిచిన పక్కనంటిపెట్టుకుని బల్లిలా పడుకుని ఉంది తాను మొట్టమొదట చూసినకల్యాణి. ఆ గదిలో చెప్పుకోదగ్గ వస్తువులేమీ కనపడలేదు చుట్టపెట్టి మూలకి బారవేసిన చాప ఒక చిన్నట్రంకు పెట్టి తప్ప. అదికాక యింకోగది. అదీ వాటా.

డాక్టర్ చెయ్యిచూసి జ్వరంగా ఉందనీ, అంతకుమించి బలహీనంగా ఉందనీ, న్యూట్రిషస్ఫుడ్ యివ్వాలనీ చెప్పి ఒక యింజక్షన్ యిచ్చి ఒక ప్రిస్క్రిప్షన్ రాసిచ్చి వెళ్లిపోయాడు. ఇంజక్షన్ యిస్తుంటే నీరసంగా మూలిగింది కల్యాణి.

డాక్టర్ వెళ్లాక 'ఏమిటి సుబ్బులూ యిదంతా! నిన్ను వెళ్లి ఆయన్ని అవస్థపెట్టి డాక్టర్ని ఎవరు తీసుకురమ్మన్నారు ?' అంది నీరసంగా - అసహాయతని

అంగీకరించలేని అభిమానం తెప్పించిన కోపంతో. "జ్వరంగా ఉంటే చూస్తూ ఎల్లా ఊరుకోను తల్లీ!" అంది. జాలిగా సుబ్బులు.

తనకి అప్పటికి అర్థమైనది - వారిదారిద్ర్యం. ఆ పరిస్థితి తనకి జాలిగొల్పింది - అసహాయతలో మునిగి ఉన్న సాటి తెలుగువారికీ అరవదేశంలో తానండ కాక తప్పదు. సుబ్బులు బలవంతపెట్టినా ఆ గాజు తీసుకోకుండా తనే వెళ్లి హార్లిక్స్ గ్లూకోజ్, డాక్టర్ చెప్పినమందు తెచ్చియిస్తూ - "ఇప్పుడో మాత్ర, రాత్రి పదిగంటలకోటి, రేప్పొద్దున్న ఒకటి యివ్వండి - నాలుగేసి గంటలకి ఒకసారి హార్లిక్స్ కలిపియివ్వండి గ్లూకోజ్ తో - ఏమీ కంగారుపడకండి. భయమేమీ లేదు- కాస్త నీరసంగా ఉందన్నాడు - రేపటికి తగ్గిపోతుంది. నేను రేప్పొద్దున్న మళ్లీ వస్తాను. ఏంకావలసినా నాతో చెప్పడానికి మొహమాటపడకండి." అని వచ్చేశాడు తను.

రూంకి వచ్చి వాళ్లని గురించే ఆలోచించాడు: వాళ్లెవరు? ఎందుకొచ్చారు? - పరిస్థితి అర్థంకాలేదు - కాని ఆ సుబ్బులు ఆమె కేమీ కానట్టుంది. కల్యాణి సంస్కారంగాని, కుటుంబపు తాహతుగాని సుబ్బులు కున్నట్టులేదు. వారిద్దరికీ మధ్యనున్నది సేవ్యసేవికా సంబంధమే. పోతే సుబ్బులికి కల్యాణిమీద అనంతమైన వాత్సల్యం ఉన్నట్లు తోస్తుంది. - ఉపకృతి పొందడానికి ఎంత అభిమానం! - డాక్టర్ 'బలహీనంగా ఉంది. న్యూట్రిషస్ ఫుడ్ యివ్వాలి' అన్నాడు. - అసలు ఆమె అనారోగ్యానికి కారణం దారిద్ర్యమేనేమో - ఇల్లు అయ్యవారినట్టిల్లులా ఉంది—

మొన్నాడు పొద్దున్న హోటల్ నించి తిరిగివస్తూ ఒక పదిరూపాయల యింటిసరుకులు తీసుకుని వాళ్ళున్న వాటాలోకి వెళ్లాడు. సుబ్బులు తలుపు తెరిచి వస్తువులు చూసి విస్తుపోయింది.

"ఎందుకు బాబూ యివన్నీ?"

"ఉంచండి. వీటికి నేను డబ్బు తీసుకుంటాను. మీరూరికే మొహమాట పడక్కర్లేదు" అన్నాడు తను.

ఇంకేం మాట్లాడకుండా ఆమె అవి తీసుకుని రెండో గదిలోకి వెళ్లి పనిలో మునిగిపోయింది.

"మీకెందుకీ శ్రమ? అసలు నిన్ననే మిమ్మల్ని అనవసరంగా బాధపెట్టాం. దానికి తోడు..." జ్వరం కాస్త తగ్గి, లేచి కూర్చునే ఓపిక వచ్చిందామెకు.

"చూడండి! అవసరాలు, ఆపదలు అనేవి అందరికీ వస్తాయి. మొహమాటం పెట్టుకు కూర్చుని అవస్థపడ్డందువల్ల లాభం ఏముంది? ఇరుగు, పొరుగు, అయింతరవాత ఆమాత్రం సాయం చెయ్యడం నా విధి" అన్నాడు తను.

కృతజ్ఞతవల్ల ఉక్కిరి బిక్కిరి కావడంవల్లో, అభిమానం ముంచుకొచ్చినందువల్లో తెలీదుగాని ఆమెకు కన్నీళ్ళు తిరుముకొచ్చాయి.

"చూడండి-" అనునయించే ధోరణిలో మొదలుపెట్టి యింకెల్లా పొడిగించాలో తెలీక నసిగాడు.

"లేదు, నేను ఏడవను. కాని నన్ను మీరు మీరనడం బాగులేదు. నా పేరు కల్యాణి. అల్లాగే పిలవండి" అంది కళ్ళు తుడుచుకుని దుఃఖాన్ని ఒక్కసారిగా విదిలించేసి. మధుకి ఆమె స్థైర్యం అచ్చెరువు కలిగించింది.

"చూడు సుబ్బులూ! కొంచెం కాఫీపెట్టి ఆయనకియ్యి" అంది లోపలున్న సుబ్బుల్నుద్దేశించి.

"చూడండి..."

"అదుగో మళ్లీ అండీ అంటున్నారు!"

"చూడు - నేనిప్పుడే తీసుకువచ్చాను. ఆ శ్రమ అనవసరం."

"అయితే మీరు పడేదంతా, బెట్టు చెయ్యకండి." వయస్సుకు మించిన శిక్షణ కనబడింది ఆమె ప్రవర్తనలో.

"ఇవాళ ఎల్లా ఉంది ఒంట్లో?" మాట తప్పిస్తూ అడిగాడు.

"చూస్తున్నారుగా, కాస్త లేచి కూర్చోగలుగుతున్నాను మీ దయవల్ల. మీకెల్లా కృతజ్ఞత చెప్పాలో తెలీకుండా ఉంది."

"ఇల్లా కృతజ్ఞతతో ఉక్కిరి బిక్కిరి చేసేస్తే యీ ఛాయలకే రాలేను. అయినా యిందులో ఏమంత ఉందని—"

పది నిమిషాల్లో కాఫీ పట్టుకొచ్చింది సుబ్బులు.

నాలుగయిదు రోజులకి కల్యాణి పూర్తిగా కోలుకుంది. ఈలోగా సుబ్బులువల్ల విషయాలన్నీ తెలుసుకున్నాడు తను.

కల్యాణి తండ్రి తాలూకా ఆఫీసు గుమాస్తా. గంపెడు పిల్లలు - ఆదాయం తక్కువ. సుబ్బులు

యింట్లో పని మనిషి. ఒంటరిది. చాలా ఏళ్ళుగా వారింటిలో పని చేసింది. కల్యాణిని చిన్నప్పటినించీ ఎత్తుకు మోసింది. కల్యాణి అంటే ఎంతో వాత్సల్యం ఆమెకు. కల్యాణి ఐదవఫారం పాసై పరిస్థితు లనుకూలించక విరమించింది. పుస్తకాలు అవీ చదువుకుంటూ, తల్లికి పనులలో సాయపడుతూ కాలక్షేపం చేసింది. పెళ్లీడుకొచ్చిన పిల్లను గుండెలమీద కుంపటిగా మోస్తూ కట్నం యిచ్చి పెళ్లి చెయ్యలేక రెండోపెళ్లివాడికివ్వ నిశ్చయించారు తలిదండ్రులు. తనకి పెళ్లొద్దని ఏడ్చి మొత్తుకుంది కల్యాణి. వారు వినలేదు. కల్యాణి దుఃఖం చూసి సుబ్బులు కరిగిపోయి ఓదార్చింది. దుఃఖం దిగమింగి కల్యాణి తప్పించుకు బయటపడడమెలాగా అని ఆలోచించి పారిపోవడానికి నిశ్చయించింది. సుబ్బులు అనుసరించడానికి అంగీకరించింది. తండ్రి జేబులోవి యాభయిరూపాయలు సంగ్రహించి అర్ధరాత్రి రైలెక్కి ఇక్కడికొచ్చి పడ్డారు. రెండు రోజులు సత్రంలో మకాం అయిం తరువాత యీ ఇల్లు తీసుకుని ఎడ్వాన్సు ఇచ్చేసరికి డబ్బు అయిపోయింది. చేతికున్న గాజుల్లో ఒకటి అమ్మేశా రిద్దరూ వెళ్లి.

కల్యాణి తప్పులతో యింగ్లీషు మాట్లాడేస్తుంది. వచ్చినప్పటినుండీ ఉద్యోగంకోసం ప్రయత్నిస్తూనే ఉంది. దొరకలేదు. డబ్బు అయిపోయింది. మిగిలిందల్లా యింకొక్క గాజు! పొదుపు చేద్దామని అర్ధాకలిగా భుజించిన ఫలితంగా జ్వరం వచ్చింది కల్యాణికి. ఆమె జ్వరపడడంతో దిక్కు తోచలేదు సుబ్బులికి. తను స్వతః అమాయకురాలు. ఏమీ తెలియదు కల్యాణికి. అండగాను, పెద్దదిక్కుగాను ఉండడం తప్ప తను చెయ్యగలిగింది శూన్యం. పిల్ల జ్వరపడేటప్పటికి బెంబేలుపడిపోయింది. కల్యాణి బలవంతంవల్ల రెండు రోజులూరుకుని మూడోరోజున వళ్లు తెలీకుండా పడి ఉంటే చూసి దుఃఖం ముంచుకొచ్చి తన సహాయం అర్థించింది.—

తరవాత రెండు రోజులకి—

పరీక్షలముందు సెలవులిచ్చారు తనకి. సాయంత్రం నాలుగుకి రూంలో కూర్చుని చదువుకుంటున్నాడు. దగ్గు వినిపించింది. తలెత్తిచూస్తే గుమ్మంలో కల్యాణి. నమస్కరించింది. తను ప్రతినమస్కారం చేసి "రా కూర్చో" అంటూ కుర్చీ చూపించాడు.

టేబిల్ దగ్గర కొచ్చి నిలబడి "ఇవి ఉంచండి" అంటూ కొన్ని అయిదు రూపాయి కాగితాలు టేబిల్ మీద పెట్టింది.

"దేనికి?" సాశ్చర్యంగా అడిగాడు తను.

"మీరు మా కింద ఖర్చు పెట్టిందానికి." అంది తలొంచుకొని. డబ్బైతే తీర్చగలనుగాని దయాఋణం ఎల్లా తీర్చను? అని ప్రశ్నిస్తూన్నట్టుంది ఆమె తీరు. తను ఆ బొత్తితీసి లెక్కపెట్టాడు. ముప్పైఉన్నాయి.

"ఇంత అవదు." అన్నాడు యింకేమీ అనలేక..

"ఎంత అయితే అంతా తీసుకోండి" అంది కల్యాణి యింకా తలొంచుకునే.

"ఉద్యోగం దొరికిందా?" అనడిగాడు.

"దొరికింది." అందికాని ఆ ఉత్సాహం కనబడలేదు మనిషిలో. అబద్ధం ఆడే అలవాటు లేని కారణంగా అది బైటపడి పోయింది.

"అబద్ధం ఆడడానికి కూడా అలవాటుండాలి కల్యాణీ!" అన్నాడు తను.

"సరే—అబద్ధం ఆడవలసిన అవసరం కూడాలేదు నాకు. ఉద్యోగంరాలేదు. అయినా మీకు రావలసినవి మీరు తీసుకోండి." అంది అభిజాత్యంతో.

తను యిరుకున పడ్డాడు. వద్దంటే అపార్థం చేసుకుంటుందేమో. పుచ్చుకుంటే — యింకామె చేతిలో పాతికో పరకో ఉంటాయి. దానితో యింకెన్నాళ్లు గడిచేటట్టు?—అసలీ ముప్పై ఉంటే మాత్రం?—ఆమె అలవంబించే యీపద్ధతి అంత సులువైనదికాదనీ తన్నకున్న చదువుతో స్వతంత్రంగా పొట్టపోసుకోవడం తేలిక కాదనీ ఆమెకు నచ్చ చెప్పాలి—అదీ కాక ఆమె తలిదండ్రులీ పాటికి ఎంతో పశ్చాత్తాపపడుతూ ఉండొచ్చు - ఏ అఘాయిత్యం చేసిందోనని భయపడుతూ ఉండొచ్చు—యీ పరిస్థితిలో ఆమె యింటికెళ్లిపోతే అన్నీ చక్కబడవచ్చు.

తన ఆలోచనలతో మౌనం వహించి ఉంటే కల్యాణి వెళ్లిపోవడాని కుద్యమించింది.

"కల్యాణీ ఒక్కమాట"

ఆగి "చెప్పండి" అంది.

"నన్ను నీ స్నేహితుడుగా తీసుకుని అపార్థం చేసుకోనంటే ఒక్క సలహా—"

"చెప్పండి" పొడిగా అంది.

"నువ్వు యింటికి వెళ్లిపో."

చురుక్కున ఒక్కసారి చూసింది తనకళ్లలోకి—కల్యాణివి అంత పెద్ద కళ్లని తన కప్పుడే తెలిసింది.

కోపగించుకోకు—సుబ్బులుమీద అలగకు. నా మాట విను."

"మీకు తెలీదు" కళ్ల నీళ్లెట్టుకుంది.

"నాకంతా తెలుసు. అప్పటి పరిస్థితులలో నువ్వల్లా చెయ్యడం తప్పలేదు. యీపాటికి మీవాళ్లు చల్లారిఉంటారు. నీకోసం బెంగపెట్టుకుని కూడా ఉంటారు — ఇక యిక్కడ నీ చదువుతో నీ కొచ్చే ఉద్యోగంతో బతకడం చాలా కష్టం. నీకు అనుభవం తక్కువ. అడుగడునా కష్టాలే ఎదుర్కొంటూ బాధ పడడంవల్ల నిస్పృహ ఎక్కువౌతుంది—నామాట విని వెళ్ళిపో కల్యాణీ! ఈ డబ్బుకూడా వుంచు. ఇంటికి వెళ్ళి పంపించు."

"అల్లాగే" ఆ డబ్బు కూడా తీసుకుని వెళ్లి పోయింది కల్యాణి.

మొన్నాడు యిల్లు కాళీచేసి వాళ్లు వెళ్లిపోయారు. వెళ్లే ముందు కనీసం తనతో చెప్పైనా వెళ్ళలేదే అని బాధపడ్డా తన మాటమీద విలువ ఉంచి వెళ్ళినందుకు తానొక విధంగా సంతోషించాడు.

నాటికి నేడు చూడ్డమే మళ్ళీ. ఇది కలలో కూడా ఊహించలేని సంఘటన. బుద్ధిగా యింటికివెళ్లి పోయి ఉంటుందనుకున్నాడుగాని యీ విధంగా మళ్లీ కలుస్తానని అనుకోలేదు తను.

"కల్యాణీ—" రీలు ఆఖరి ఫ్రేము చూస్తూ మరో లోకంనించి పిలిచాడు మధు.

"టైం మెషీన్ ముందుకి తిప్పండి సార్" చిలిపిగా నవ్వుతూ అంది తపతి.

"అక్కడ అంతర్ధానమైన రాకుమారి యీ మణిమయ హర్మ్యంలోకి వచ్చేలోపున జరిగిన కథ ఏమిటి?" కుతూహలంతో అడిగాడు.

"తరువాయి కథ వెండి తెరపై తిలకింపుడు."

"అది పాంప్లెట్స్‌మీది భాష. కావాలనుకున్న వాళ్ళకి తెరమీద దొరుకుతుంది జవాబు. ఇక్కడది చెల్లదుగా."

"అట్లయిన సావధానంబుగా నాలకింపుడు. ఆనాడు మీ వచనంబుల శిరసావహించలేకను మిమ్ము నొప్పింప నిష్టంబులేకను మరొక గృహంబునకు తరలితిమి. హస్తంబునందలి ద్రవ్యంబు వెన్నవలె కరుగజొచ్చె—అబ్బ యింక గ్రాంధికము ఆపేస్తాను—డబ్బు చెల్లుబడి అయిపోతూంటే నిస్పృహ ఎక్కువౌతూ మీ మాటైనా విననైతినే అని బాధపడి అందుకూడా డబ్బు చాలని స్థితిలో కొచ్చాం. అల్లా యింకొద్ది రోజులు జరిగితే ఏమయ్యేదో చెప్పలేనుగాని ఒక గర్ల్స్ స్కూలు ఆఫీసులో అటెండర్ పోస్టు దొరికింది. అమాంబాపతులు యాభైరూపాయల జీతం. అది చాలక నానా తిప్పలు పడుతున్నా కొంతవరకు నిరాశ తొలిగి బ్రతుకుమీద ఆశ జనించింది. ఎటండర్‌నే అయినా నాలుగు ముక్కలు వచ్చును గనక క్లర్కు పని చేసిపెట్టి హెడ్‌మిస్ట్రెస్ మన్ననకి పాత్రురాలి నయ్యాను. ఆమె నామీద దయదలిచి రెండుమూడు యిళ్ళల్లో ఒకటి రెండు తరగతుల పిల్లలకి ట్యూషన్స్ యిప్పించింది. అవో పాతికవచ్చేవి. ఇల్లా ఆరునెలలు గడిచాయి. యీలోగా మా హెడ్‌మిస్ట్రెస్ ప్రోత్సాహంతో నేను మెట్రిక్‌కి కట్టడానికి సన్నాహాలు చేసుకున్నాను.

"కాని యింతలో మరో సంఘటన పరిస్థితుల్ని తారుమారు చేసింది. ఒకనాడు ఒక ఇంట్లో ట్యూషన్ చెప్తూండగా ఒకాయన వచ్చారు. పాఠం చెప్తున్న నన్ను యాధాలాభంగా చూసి, ఆపైన ఆగి పరిశీలనగా చూసి నేను తలదించుకోవడంతో బాగుండదనుకొని లోపలకు వెళ్ళిపోయారు.

"అరగంట తరవాత తిరిగి వస్తూ అప్పుడే పాఠం ముగించి వెళ్లిపోబోతూన్న నన్నుద్దేశించి 'చూడమ్మా! నీకు సినీమాలో నటించడానికి ఏమైనా అభ్యంతరం ఉంటుందా?' అని అడిగేసరికి నాకుమతిపోయి కళ్లప్పగించిచూస్తూఉండిపోయాను. ఆయన నా అదురుపాటు గ్రహించి నవ్వి, 'కంగారు పడకమ్మా! ఆలోచించుకునే చెప్పు.' అంటూ నిష్క్రమించారు.

"తరవాత తెలిసింది ఆయన కెమారామన్ అనీ, ఆ యింటాయన స్నేహితుడనీ, ఆయన పని చేస్తున్న పిక్చర్లో కొత్తవాళ్లకి స్థానం యివ్వాలని వాళ్ల ప్రొడ్యూసర్ నిర్ణయించారనీ, వాళ్లు కొత్తముఖాల కోసం వెతుకుతున్నారనీను.

"కెమరాతోటి అనుభవంవల్ల నామొహం ఫొటోజెనిక్‌గా ఉంటుందని ఆయన గ్రహించారు.

"ఆయన ఆ ముక్కలన్నప్పటి నా అవస్థ వర్ణనాతీతం. అది నిజమో వేళాకోళమో తెలీదు. కాని చాలా ప్రసన్నంగా వున్న ఆయన ముఖంలోకాని మాటల్లో కాని వేళాకోళానికి తావు కనబడలేదు. అయినా

ముక్కు మొగం ఎరుగని నాతో ఆయనకి పరిచికా లేమిటి?-కాని సినీమాకి పనికివస్తానని నేను నమ్మలేకపోయాను. గొప్ప అందగత్తెనని ఎప్పుడు అనుకోలేదు! ఎవరూ నాతో అనలేదు.

"ఏం చెయ్యడానికీ తోచలేదు. యింటికివెళ్లాను. ఏదో తెలియని భయం, ఆనందం-రెండూ నన్నావహించాయి. ముళ్లమీద వున్నట్టనిపించింది. ఎవర్ని సలహా అడుగుదామన్నా — మా సుబ్బులు వట్టి వెర్రిది-మా హెడ్ మిస్ట్రెస్‌ని అడిగితే తానెటూ చెప్పలేనంది. ఒకలా చూస్తే అదృష్టం— కాని భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలీదు—నిశ్చయం తీసుకోవలసివచ్చింది. ఎంత యోచించీ ఏదీ తేల్చుకోలేక రెండు చీట్లు 'చేరు, 'వద్దు' అని రాసి లాటరీ వేసి సుబ్బులుచేత తీయించాను. 'చేరు' అని వచ్చింది— తెగించి చేరడమే మంచిదనిపించింది. అదివరలో ఒకసారి తెగించి యింట్లోంచి పారిపోయాను భావిమీద ఊహ లేకుండానే. సరే యిప్పుడూ అదే మంచిదనిపించింది.

"మూడో రోజున ఆయన వచ్చి మళ్ళీ అడిగారు-ఒప్పుదల సూచించాను. స్క్రీన్ టెస్ట్‌కి తీసినఫోటోలో నా మొహం చూసిన నాకే ఆశ్చర్యం వేసింది. అ మాత్రం బాగుంటానని నాకేనాడూ తట్టలేదు—అదివరలో నేనెన్నడూ ఫోటో తీయించుకుని ఎరగను.

"మొదటి పిక్చర్లో నా పాత్ర చిన్నదైనా చాలా మందిని ఆకర్షించింది—తరవాత చెప్పుకోదగ్గ వేమీ లేవు—రొటీన్‌లో పడడం-పేరు పెరగడం-ఆదాయం పెరగడం తప్ప—" కథనం ముగించింది తపతి.

ఇంతలో పని మనిషి ట్రేలో రెండు గ్లాసులలో పళ్ళరసం-రెండు సాసర్లలో రెండేసి స్లైసుల బ్రెడ్ మరో డిష్‌లో బట్టర్, రెండు చక్రకేళీ అరిటిపళ్ళు— రెండు నైవ్స్ (Knives) గోడపక్కనున్న మూవబుల్ టేబుల్ మీద పెట్టి తోసుకుంటూ వచ్చింది మంచం దగ్గిరికి.

తపతి కత్తితో వెన్న తీసి బ్రెడ్ స్లైస్‌లకి రెండు వైపులా దిట్టంగా పట్టించి ఒకటి మధుకి అందిస్తూ "తీసుకోండి" అంది.

"నేను భోజనం చెయ్యాలి పోయి. ఇప్పుడివి తింటే ఆకలి చెడుతుంది. అయినా నీకు మాత్రం భోజనం ముందు యివి ఏమిటి?" అన్నాడు ఆమెను వారిస్తూ.

"నాకు రాత్రి భోజనం యిదే. ఎక్కువ తింటే లావెక్కిపోతానని చెప్పాడు డాక్టర్." అంటూ నవ్వి "మీకు అభ్యంతరం అయితే మానెయ్యండి" అంది నిష్టూరంగా.

"అభ్యంతరమని కాదు—" గొణిగాడు.

"అయితే తీసుకోండి" అని అతని కొకటి అందిచ్చి తానొకటి తీసుకుంది.

"అమ్మగారూ" అంది పని మనిషి.

"ఏమిటి రుక్మిణీ?" అడిగింది తపతి.

"సెక్రటరీగారు మిమ్మల్ని కలుసుకోవాలంటున్నారు."

"సరే రమ్మను—అయితే యింతకీ అమ్మగారేరీ?"

"పార్థసారధి కోవెల కెళ్లారు."

"తిరిగి వచ్చిం తరవాత పైకోసారి రమ్మను వెళ్లు" అంది.

ఆరగింపులయ్యే వేళకి సెక్రటరీ వచ్చాడు.

తల సగం తెలుపుకి తిరిగిన నలభై అయిదేళ్ళ వ్యక్తి ఆయన.

"కూర్చోండి" అంది కుర్చీ చూపించి.

కూర్చున్నాడు.

"చెప్పండి" అంది తపతి.

"రేపు మీకు '—' పిక్చర్కు సెవెన్ టు నైన్ కాల్ షీట్ ఉంది."

"జ్ఞాపకం ఉంది. కణ్ణాకి గూడా చెప్పండి."

"తరువాత '—' ప్రొడక్షన్స్ వాళ్ల సుందరం గారు మూడు సార్లు ఫోన్ చేసి అయిదింటికి స్వయంగా వచ్చారు. వచ్చే నెలలో 16, 17, 18 తారీఖులలో కనీసం సింగిల్ కాల్ షీట్స్ అయినా కావాలట."

"మరి మనం యిచ్చిన డేట్సు—"

"హీరోగారికి ఆ సెట్‌లో వచ్చే మరినలుగురికి అవి సరిపడలేదుట."

"ఎడ్‌జస్ట్ చెయ్యగలరా?"

"కుదరదు."

"ఏమాత్రమూ"?

"ఊహు".

"అయితే అల్లాగ చెప్పెయ్యండి."

"ఆవలెల్లుండి షెడ్యూల్‌లో మార్పులొచ్చాయి. '—' ఆర్ట్స్ ప్రొడక్షన్ వాళ్ల క్లైమాక్స్ సీన్స్‌కి కాల్

షీట్ ప్రొవైడ్ చెయ్యవలసి వచ్చింది. అవాళ మీ కున్న పని '—' మూవీస్‌తో—అది వాళ్ల అనుమతితో కాన్సిల్ చేసాను."

"వాళ్లు మీ కెంత యిచ్చారు?" నవ్వుతూ అడిగింది తపతి.

"ఏమిటి మీ ర నేది?" కోపం ప్రకటించాడు.

"తగ్గండీ—"

"ఇల్లా ఐతే—"

"ఇక్కడ పని చెయ్య లేనంటారు. మంచిది. శుభస్య శీఘ్రం" టక్ మని అనేసింది—

గబుక్కున ఆమె అనెయ్యడంతో సెక్రటరీ నోరు మూతపడిపోయింది.

"చూడండి—ఎందుకు మీ కివన్నీ — మీకు యిబ్బంది అయినప్పుడు నన్నడగరాదా?—మొన్న మీ అమ్మాయి పెళ్లంటే రెండు వేలిచ్చాను—అబ్బాయి చదువంటే యిచ్చాను—ఇంక మీకు తృప్తి ఎక్కడికి? నాకు ఒకరిద్దరు చెప్పారు. వాళ్లని డబాయించాను మీ తరఫున వాదించి. కాని నిప్పులేందే పొగరాదు. ఈ విషయంలో నాకు మళ్లా కంప్లెయింట్ వస్తే బాగుండదు—పై నెల్లో కాల్‌షీట్స్ కావాలన్నారన్నారే సాధ్యమైనంతవరకు ప్రయత్నించి సరిపెట్టండి. వాళ్లదగ్గిర ముక్కుపిండి వసూలు చేస్తున్నాం గదా! డబ్బు—వాళ్ల కెందు కిబ్బంది పెట్టాలి చెప్పండి" సన్న సన్నగా చివాట్లు వేస్తూ నచ్చజెప్పే ధోరణిలో అంది తపతి.

మౌనం వహించాడు సెక్రటరీ—కాని యింకా కదలలేదు.

"ఇంకేం కావాలి?"

"ఇన్‌కమ్ టాక్స్ వాళ్ల దగ్గర్నించి పదివేలు ఫైన్ కట్టమని నోటీ సొచ్చింది. '—' పిక్చర్స్ ఎక్కౌంట్సులో మనకిచ్చిన 'బ్లాక్' 'వైట్'లో ఎంట్రీ వేసారుట—"నసిగాడు.

"కిక్కురు మనకుండా కట్టేసి ఆ రసీదు చూపెట్టి ఆ పదీ ఆ ప్రొడ్యూసర్ దగ్గిర వసూలు చెయ్యండి—ఇంక మీ పని ముగిసినట్టేనా?"

"ఆఁ" అని సెలవు తీసుకున్నాడు సెక్రటరీ.

ఒక్క నిట్టూర్పు విడిచి "యిదీ వరస!" అంది తపతి మధుతో.

క్షణక్షణానికి అధికమౌతున్న ఆశ్చర్యం కనుపించిందతని ముఖంలో.

"ఇంక నే వెడతాను—"అంటూ లేచాడు.

"అప్పుడే—అన్నట్టు శ్రీమతి ఎదురు చూస్తూంటుంది గాబోలు—"

"అంత భాగ్యానికి నోచుకోలేదు." నవ్వుతూ అన్నాడు మధు.

"ఏం?" యీ మాటు నిజంగానే ఆశ్చర్యపోయింది తపతి.

"ప్రత్యేకం కారణాలంటూ ఏమీ లేదు — అయినా ఘటన ఉండొద్దూ?" మళ్లీ నవ్వాడు.

"మకాం ఎక్కడ?"

"టి. నగర్."

"అయితే యిప్పుడు రూంకెళ్లి మాత్రం చేసేదేముంది? ఇక్కడ ఉండిపొండి."

"ఊహు"

"ఏం పరువు తక్కువా?"

"ఎందుకూ?"

"మరంత మొహమాట మేం? ఒకపూట నా ఆతిథ్యం స్వీకరించలేరూ?" బ్రతిమాలే ధోరణిలో అంది.

"సరే అల్లాగే కానియ్యి."

"ఇంతకీ ఉద్యోగం ఎక్కడ?"

"ఏదో ప్రైవేట్ ఫర్మ్."

"ఎంతిస్తారు?—అయినా అడిగితే కోపం వస్తుందేమో?"

"కోపం ఎందుకూ?—నూటయాభై."

"ఇంతే!!?"

"ఏం డబ్బు కురుస్తుందనుకున్నావా?"

"స్కూల్ ఫైనల్ పాసయ్యాడు మా సెక్రటరీ-నేను అడపా తడపా యిచ్చేది కాక నెలనెలా మూడు వందల యాభై యిస్తాను."

"నువ్వు అదీ పాసవలేదు. లక్షలార్జిస్తున్నావు."

"ఎంత అన్యాయ?" కళ్లు గుండ్రనచేసి మూతి సున్నాలా చుట్టి ముద్దు ముద్దుగా అంది.

"మానవ సహజం."

బైట అడుగుల సవ్వడి వినవచ్చినది.

తలుపు తెరుచుకుని సుబ్బులు వచ్చింది.

ఖరీదైన దుస్తులు, కొద్ది నగలు తప్పించి అప్పటికీ యిప్పటికీ ఆమెలో మార్పు లేదు.

మధుని చూసి ఆశ్చర్యపోయింది.

"నమస్కారం బాబుగారు! ఎన్నాళ్ళకి మళ్ళీ!"

"మౌంట్ రోడ్డులో కనబడితే లాక్కొచ్చాను సుబ్బులూ—మన్ని బొత్తిగా మరిచేపోయారు.—" అంది తపతి.

"ఏనాటి మాటమ్మా! కులాసాగా ఉన్నారా బాబూ?"

"ఆ!" అన్నాడు మధు.

"మా సుబ్బులు మాత్రం నన్ను వది లెయ్యలేదు." అంది తపతి మధుతో.

"అదేమిటి తల్లీ అల్లా అంటావు—"అని వాత్సల్య పూరిత దృష్టిలో తపతిని తిలకించి—మధుతో "ఎన్నో సార్లు ఉత్తరాలు రాసింది—నన్ను పంపింది—తండ్రి పోనేపోయాడు, తల్లి చెల్లెళ్లు తమ్ముళ్లు—ఒక్కళ్లు రారు. అమ్మాయిని రమ్మనరు. కాని అమ్మాయిపంపే-" అర్థోక్తిలోనే ఆగిపోయింది, "సుబ్బులూ" సగం నిర్లిప్తత, సగంకోపం కలిసిన స్వరంతో తపతి అనగానే.

మధుకి అర్థం అవనే అయింది.

"తల్లీ బాబుగారి భోజనం—"

"పైకి పంపించు."

"నే నిలా ఉండడం నీ కిష్టం లేదా? — ఇప్పుడివన్నీ తిని—"యిస్తే అంతే తినండి — కాదంటే ఇంకో గంట పోయాక—"బలవంతపెట్టింది తపతి.

"తప్పనప్పుడు చేసెదేముందీ - యిప్పుడే చేస్తాను. కాని—"

సుబ్బులు కిందకెళ్లి వంటమనిషిచేత భోజనం పంపించింది.

"ఆ కూరలా పారేస్తారేం?" "ఇంకొక్క ముద్ద తింటే ప్రమాదమా" "ఆ పెరుగు వదిలేస్తే నా మీదొట్టే" —ఇలా అంటూ అప్యాయంగా బలిమాలీ, కోప్పడీ, పట్టుపట్టి తపతి తినిపిస్తుంటే వద్దనుకుంటూనే మరి నాలుగు ముద్దలు ఎక్కువ తిన్నాడు మధు.

పక్కన మనిషి కూర్చుని తినిపిస్తే భోజనం యింత తృప్తిగా ఉంటుందని అతనికి జీవితంలో మొదటిసారిగా, తట్టింది. గత పదిపన్నెండేళ్లుగా హోటల్ కూటికి అలవాటుపడి పప్పూ, సాంబారు, పెరుగూ పొద్దున్నా, కూరా, చారూ, పెరుగూ రాత్రీ ఆకలిగా ఉన్నా అర్థాకలిగాతిని లేచిపోయే అతనికిది నూత్నానుభవమే. ఇంటిలో తానొక్కడే సంతానం కాదు—అంచేత తల్లి తనకేనాడూ యింత శ్రద్ధగా తినిపించే యోగ్యత దక్కలేదు. చదువు ఉద్యోగాల మధ్య తనించుమించు ఇంట్లో పరాయివాడే అయిపోయాడు.

ట్రేలోని తాంబూలపు సామగ్రిని తీసి వక్కపొడి మధు కిచ్చి తాను వేసుకుని, ఆకులకి రోజ్ కలర్ సెంటెడ్ సున్నం రాసి యీనెలు తీసి చిలకలు చుట్టి అతనికిచ్చి తాను వేసుకుంది.

బాల్కనీ నంతా కాంతివంతం చేస్తున్న లైట్ ఆర్పి వెన్నెల వెలుగులో ఆకాశపు చాందినీ కింద కుర్చీలలో కూర్చున్నా రిద్దరూ.

మబ్బులులేని ఆకాశంలో మిణుకు మిణుకు మంటున్నాయి చుక్కలు. అష్టమి చంద్రుడు అర్ధ వృత్తమయిన కృతిలో ఉన్నాడు. చుట్టూఉన్న గార్డెన్ లోని మొక్కల ఆకులు ఆ మసక వెల్తురులో నల్లగా కనిపిస్తున్నాయి. చల్లనిగాలి, ప్రకృతీ కలిసి మనసును చల్లబరుస్తున్నాయి.

అప్పుడప్పుడు తిరిగే కార్ల హారన్ల మోత నిశ్శబ్దాన్ని భంగపరచడం — హెడ్ లైట్స్ వెల్తురు చెట్ల మీదనించి నీడలని సాగించుకుంటూపోవడం — ఇవే మార్పులు ఆ వాతావరణంలో.

చాలా నిమిషాలు మౌనంగా గడిచాయి వారి మధ్య.

"కల్యాణీ — " నిశ్శబ్దాన్ని చీలుస్తూ మధే పిలిచాడు.

"ఊఁ" పలికింది తపతి.

"నిద్రవస్తోందా ?"

"ఉహు."

"ఆలోచిస్తున్నావా ?"

"ఉహు."

"మరి మౌనం వహించావేం ?"

"ఊహకి కూడా అతీతమైన సంతోషంతో నిండింది నా మనస్సివాళ — ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయిన నా మెదడు ఆలోచించదు — నా నాలుక మూగవోయింది—" కళ్లు మూసుకుని అంది తపతి.

"ఏమి టా సంతోషానికి కారణం ?"

"మీ రాక."

"ఏ స్క్రిప్టులోది కల్యాణీ యీ డైలాగులు" నవ్వాడు మధు.

చటుక్కున ఒక్కసారి కోపంతో లేవబోయి, మళ్ళీ సంబాళించుకుని - "కల్యాణి ఆత్మకథలోది" అంటూ నవ్వేసింది.

"నవ్వుతావేం?"

"మీరు నమ్మలేని నిజాన్ని చెప్పిన పొరపాటుకు—"

"అడుగులకి మడుగులొత్తే యింతమంది మధ్య, డబ్బుతో తులతూగే నీకు నా ఉనికి ఆనందాన్నిస్తుందంటే ఎలా నమ్మను కల్యాణీ—"

"డబ్బు, డబ్బు, డబ్బు—దానితోనే నాకున్న గౌరవమంతా - మనిషిగా నే నెవ్వరికీ అక్కర్లేదు మా సుబ్బులికి తప్ప—ఛీ!" చీత్కారం చేసింది.

మౌనంగా ఊరుకున్నాడు మధు.

కొద్ది క్షణాల తరువాత "ఊరుకున్నారేం? కోపం వచ్చిందా?" మృదువుగా అడిగింది తపతి.

"లేదు."

"అనుమానాలు పెంచుకోకుండా కాస్సేపు హాయిగా ఎందుకుండలేరు మీరు?"

"దానికీ అలవాటుండాలి."

"ఇంక ఆపండి — మీరోటి - నేనోటి - యిల్లా అనుకుంటూపోయి ఏం ప్రయోజనం?—వాటికేం గాని మీకు ఒకవారం లీవు దొరుకుతుందా?"

"ఎందుకూ?"

"చెప్పండి."

"కావాలంటే దొరుకుతుంది."

"మీరో వారం సెలవు పెట్టి యిక్కడేందుకుండిపోకూడదూ?" బ్రతిమాలే ధోరణిలో అడిగింది.

"అల్లాగే — కాని నా బట్టలు అవీ రూంలో ఉండిపోయాయి."

"రేపొద్దున్నే మీరు లేచే వేళకి తెప్పిస్తాను. 'కీ' యిటివ్వండి."

యిచ్చాడు మధు.

మళ్లీ నిశ్శబ్దమైంది వాతావరణం.

భోజనం ఉదాత్తం కావడం మూలానా, చల్లటి వెన్నెల, చిరుగాలి, ప్రకృతి జోలపాటల కారణంగాను మధుకి కునుకు పట్టింది.

పది నిమిషాల తర్వాత—

"చూడండి—" అని మెదలెట్టి మధు పలక్కపోయేటప్పటికి లేచి అతని దగ్గరికెళ్ళి కుదిపి "మిమ్మల్నే—భలే! అప్పుడే నిద్రపోయారే—లోపలికెళ్లి నా గదిలో పడుకోండి" అంది తపతి.

"మరి నువ్వో?" లేచి బద్ధకంగా అడిగాడు.

"నా సంగతికేం ఆ పక్క గదిలో పడుకుంటాను."

మధు లేచి యాంత్రికంగా పక్కమీదకు వెళ్లి పడ్డాడు.

కూడా వెళ్లిన తపతి పెద్దలైట్ ఆర్పి ఆకుపచ్చటి బెడ్‌రూం లైటు వెలిగించి సీలింగ్ ఫాన్ తక్కువ స్పీడ్ ఉంచి పక్క గదిలోకి వెళ్లిపోయింది.

తీరా పక్కమీద వాలిం తరువాత అతని నిద్ర తేలిపోయింది. అంత మెత్తటి పరుపు అలవాటులేని కారణాన సుఖాపాది కాలేకపోయింది.

మళ్ళీ ఆలోచనలు చుట్టు ముట్టాయి.

ఇన్ని భౌతిక సుఖాల మధ్య తపతి నైరాశ్యమే అనుభవిస్తున్నట్టు తోస్తుంది. సౌఖ్యమైనంతవరకు మనస్సును మభ్యపెట్టి సుఖిస్తున్నానని అనుకోవడానికి ప్రయత్నిస్తున్నట్టే కనబడుతుంది. ఎందుకని? - యీ వాతావరణం కృత్రిమం కావడంనించా?—తన డబ్బు చూసి గౌరవిస్తే మాత్రం బాధపడడం ఎందుకు? ఎవరైనా తమకున్న ఏదో ఒక గుణంవల్ల గౌరవింపబడతారు. ఆ గుణం డబ్బే ఎందుకు కాకూడదు? తనకే డబ్బుంటే ఛస్తే యిన్ని ఆలోచనలు చెయ్యడు - హాయిగా అనుభవిస్తాడు.

ఇల్లా ఆలోచిస్తూ ఎప్పుడో నిద్రపోయాడు.

మెలుకువ వచ్చి వాచీ చూసుకునేసరికి ఎనిమిది అయిపోయింది. తూర్పువైపు కిటికీలోంచి ప్రొద్దుటి ఎండలో శోభిస్తున్న వివిధ రకాల పువ్వుల మొక్కలు. వాటి మధ్య తోటమాలి.

ఇంతసేపు నిద్రపోయినందుకు సిగ్గుపడుతూ గబుక్కున లేచాడు.

పక్కనే టేబిల్ మీద తన బ్రష్, పేస్ట్, టవల్ పంచ చొక్కా అన్నీ ఉన్నాయి. అవి చూడగానే కల్యాణిని తల్చుకుని "ఎంత శ్రద్ధ" అనుకుని కాలకృత్య నిర్వహణకి బాత్ రూంలో చొరబడ్డాడు.

మూడడుగుల ఎత్తువరకు పాలగచ్చు చేయబడ్డ గోడలు, షవర్, టాప్ ఎరేంజ్ చెయ్యబడ్డ టబ్— ఇవి కాక ఒక పక్కకి సింక్, వేడినీళ్ళకీ చన్నీళ్ళకీ చెరోపక్కా టాప్‌లు, భుజాల దగ్గిరనించి పైకి కనబడేటట్టు గోడకి అమర్చిన అద్దం - దండాలమీద టవల్స్-

ఒక అలమారులో సబ్బు బిళ్లలు, లిక్విడ్ సోప్ బాటిల్, డెట్టాల్, ఫినైల్ —

డబ్బు విలువ మరోమారు దిగ్భ్రమ కలిగించింది మధుకి.

కాలకృత్యాలు ముగించి గదిలోకి ప్రవేశించేసరికి పని మనిషి రుక్మిణి కాఫ్యాదులు సిద్ధంగా ఉంచింది.

కాఫీ తాగుతూ "అమ్మగారేరి?" అని అడిగాడు.

"రెండు గంటలక్రితమే పెద్దమ్మగారు, చిన్నమ్మగారు షూటింగ్‌కి వెళ్లిపోయారు, మీరు లేచేవరకు మిమ్మల్ని లేపవద్దన్నారు. ప్రతి పావుగంటకీ వచ్చిపోతున్నాను. ఇది మీకిమ్మన్నారు" అంటూ ఒక చీటి అందించింది.

నిద్రలేపడం యిష్టంలేక చెప్పకుండా వెళ్లిపోయినందుకు ఏమీ అనుకోవద్దనీ, పెద్దకారు అట్టేపెట్టాననీ ఎక్కడికి కావలసినా వెళ్లమనీ, చదువుకోదల్చుకుంటే లైబ్రరీరూంలోకి వెళ్లమనీ, ఏవిధమైన మొహమాటమూ పెట్టుకోవద్దనీ సూచించిందందులో.

"ఎంత శ్రద్ధ! ఇన్ని పనుల మధ్య—" మరోసారి అనుకోకుండా ఉండలేకపోయాడు మధు. అతని మనస్సంతా మాధుర్యంతో నిండింది.

"మీ బట్టలు బీరువాలో ఉన్నాయి-మంచానికీ హాలులోను కాలింగ్ బెల్లు మీటలున్నాయి మీరెవర్నైనా పిలవదల్చుకుంటే—"అంటూ కాఫీ ప్లేట్లు తీసుకుని వెళ్లిపోయింది రుక్మిణి.

మాయామందిరంలోకి వచ్చిపడ్డట్టయింది మధుకి. తనకి కావలసినివన్నీ వాటంతట అవే ప్రత్యక్షమౌతున్నాయి.

క్రిందకు వచ్చాయి.

హాల్లో ఒక మనిషి ఎదురై "కారు తెమ్మంటారా?" వినయం ఉట్టిపడుతూ అడిగాడు.

"అక్కర్లే, కాని లైబ్రరీరూం ఎక్కడ?"

"ఇటురండి" అంటూ లైబ్రరీలోకి దారితీశాడు.

నీట్‌గా బీరువాలో సర్ది ఉన్నాయి పుస్తకాలు.

ఒక యీజీఛైర్ పక్కనో చిన్న టేబుల్, దాని మీద టేబిల్ లైటు.

తనకు తెలిసి ఉన్న పుస్తకాలన్నీ ఉన్నాయి బీరువాలో. తనకి తెలియని వెన్నో ఉన్నాయి.

కల్యాణి యివన్నీ చదివి ఉంటుందా?—లేక కేవలం యివన్నీ గృహాలంకరణలోని భాగాలేనా?

అలెగ్జాండర్ డ్యూమా కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో తీసి పడక కుర్చీలో కూలబడి అందులో మునిగిపోయాడు.

పదకొండు గంటలకు రుక్మిణి వచ్చి భోజనం మాట గుర్తుచేసేవరకు అతనికి యీ ప్రపంచపు ఉనికే గుర్తులేదు.

తపతికి అత్యంత సన్నిహితుడని తెలియడంతో ఎంతో శ్రద్ధాభక్తులతో మెలుగుతున్నారు సేవకులు మధుపట్ల. ఇంప్లిసిట్ ఒబీడియన్స్ తప్ప ఒకరి ప్రవర్తనని విమర్శించే తత్వం కాదు వారిదని గ్రహించాడు మధు.

సాయంకాలం అయిదు గంటలకి డ్రైవర్ని పిల్చాడు.

మౌంట్‌రోడ్‌లోంచి మెరీనాకి పొమ్మన్నాడు.

స్పెన్సర్ కంపెనీ—మహమ్మద్ యిబ్రహీం—ఎయివేస్ బోర్డులు—అన్ని దాటిపోతున్నాయి.

నిన్నటికీ యివ్వాళ్టికి ఎంత తేడా?

నిన్న అదే ప్రదేశాలని పేవ్‌మెంట్ మీద నడుస్తూ తిలకిస్తూ కార్లల్లో పోయేవాళ్లని చూచి అసూయపడ్డాడు.

కాని యివాళ అల్లా అనిపించడం లేదు.

కారు రోడ్డుమీద నిశ్శబ్దంగా జారిపోయే నలభై వేలు ఖరీదుచేసే కారులో ఉన్నాడతను. పేవ్‌మెంట్స్‌మీద నడుస్తున్న వారిమీద జాలివేసింది—తనలాటి కొందరు తన కారులోకి నిక్కినిక్కి చూస్తున్నారు.

కారు మెరీనాలో ఆగింది. డ్రైవరు వచ్చి తలుపు తెరిచాడు.

దిగుతున్న మధుకి "తపతి కారు కదూ అది—వాడెవడు" అన్న మాటలు ఏమూలనుంచో వినబడ్డాయి.

అతని గుండెలు పిడచగట్టుకుపోయాయి.

గబుక్కున మళ్లీ కారెక్కేద్దామా అనిపించింది- అయినా ఎవడో ఏదో అంటే తనకెందుకు బాధ—వారిని తానాపగలడా?

అటూ యిటూ నాలుగడుగులు వేశాడు.

ఆ సముద్రపు హోరు—ఆ జనసందోహం—ఆ కోలాహలం—ఎందుకో అతన్ని ఉత్సాహపరచలేక పోయాయి.

కొంతసేపు ముళ్లమీదున్నట్టు గడిపి యింటికి తిరిగి వచ్చేశాడు.

అతనికి అన్ని మర్యాదలు టైం ప్రకారం జరిగి పోతున్నాయి.

రాత్రి పది గంటలకి కూడా రాలేదు తపతి.

గత రాత్రి సరిగ్గా నిద్రలేనందున వెంటనే నిద్ర వచ్చేసింది మధుకి.

ఒంటిగంటకి మెలుకువ వచ్చేసింది—

కల్యాణి వచ్చిందో లేదో?

లేచి ఆమె గది తలుపు తోసుకుని లోపల ప్రవేశించాడు.

దుస్తులన్నా మార్చుకుండా Exhausted గా పడుకుని నిద్రపోతోంది కల్యాణి. కటిక రాతి నేలమీద గూడా ఆమెకా స్థితిలో నిద్ర వచ్చేస్తుంది—ఆ పరుపుల సౌభాగ్యాన్ననుభవిస్తున్న స్మృతి కూడా ఆమె కున్నట్లులేదు.

మంచం దగ్గరగా వెళ్లాడు. ఆ స్థితిలోవున్న ఆమెను చూచేసరికి మధుకి అపరిమితమైన జాలి వేసింది. లక్షలార్జించికర్చుపెట్టేఆమెకు క్షణంవిశ్రాంతిఉండదు! రాత్రి భోజన మే లేదు—ఇన్ని భౌతిక సుఖాల మధ్య ఆమె తన యిచ్చవచ్చినట్టుండడానికి వీలులేదు.

పక్కమీద కూర్చుని ఆమె ముఖంమీద పడుతున్న ముంగురులని సవరించి చిరుచెమటను తుడిచాడు.

ఆ స్పర్శకు ఆమెకు మెలుకువ వచ్చింది—

బద్ధకంగా అరమోడ్పుగా తెరిచిన కన్నులలోంచి అతన్ని చూస్తూ "మీరా—నిద్రపట్టటంలా" అంది నిద్రతో బరువెక్కిన కంఠంతో—

ఇటు ఒత్తిగిలిన ఆమె శరీరం మధుశరీగాన్ని తాకింది—వెచ్చగా తగిలిన ఆ స్పర్శ అతని రక్తాన్ని ఉడుకెత్తించింది.

పొద్దున్నే లేచిన మధు రాత్రి జరిగినది కలేమో ననుకున్నాడు గాని, తను తన గదిలో లేకపోవడం, కాదని సాక్ష్యం పలికింది.

చచ్చే సిగ్గు వేసిందతనికి—

నిన్నటిలాగే తపతి యివాళ కూడా మధు లేచే సరికి వెళ్లిపోయింది.

కాని సాయంకాలం అయిదుగంటలకే వచ్చేసింది.

వస్తూనే మధు దగ్గిరకి వచ్చి "ఎక్కడికీ వెళ్లలా మీరు—భలేవారే—" నవ్వింది వెన్నెలలు కురిపిస్తూ.

కాని మధు మాత్రం ఆమె ముఖంలోకి చూడలేకపోయాడు.

అది గ్రహించిన తపతి అతని గడ్డంపట్టుకుని తల పైకెత్తి కళ్ళల్లోకి చూస్తూ "ఎందుకో మూగనోము-" అంది.

"అబ్బే ఎందుకూ?" అన్నాడు తడబడుతూ.

"అదే నేనూ అడుగుతూంట—సరే మీరూ ఎక్కడికీ వెళ్ళలేదన్నారుగా—రెండు నిమిషాలలో బట్ట మార్చుకుని వస్తాను. మీరూ రెడీ అవండి" అంటూ వెళ్లిపోయింది మేడమీదికి.

మధు కూడా అనుసరించాడు.

పావుగంట తరువాత యిద్దరూ కిందకి దిగారు.

పోర్టికోలో పెద్ద కారుంది.

ముందు తలుపు తెరిచి "మీరెక్కి ఆ పక్కకి జరగండి—" అని అతను ఎక్కిన తరువాత తను ఎక్కి స్టీరింగు ముందు కూలబడింది.

అతి చాకచక్యంగాను, వేగంగాను ట్రాఫిక్ ని తప్పించుకుంటూ ఊరు వదిలి తిన్నగా పోనివ్వసాగింది.

పక్కలకి సరుగుడు చెట్ల వనాలు, ఎడతెగని యిసుక దిబ్బలు, దూరంగా ఆకాశంతో చేతులు కలిపే నీలికడలి.

ఊరు దాటగానే ఆ ఆటోమాటిక్ కన్వెర్టిబుల్ టాప్ వెనక్కి తప్పించేసింది తపతి.

వేగంగా పోతున్న కారుకి ఎదురు వస్తున్న చల్లటి సముద్రపు గాలి ఎంతో ఆహ్లాదాన్ని కల్గిస్తూంది.

పదిమైళ్లు పోనిచ్చి ఒక పక్కకి కారాపి డాష్ బోర్డు సొరుగు తాళం తీసి అందులోంచి ఒక ట్రాన్సిస్టర్ రేడియో బైటకి తీసి తను దిగి, "దిగండి స్వామీ" అంది.

మధు కూడా దిగాడు.

ఫోల్డింగ్ కెమెరా అంత ఉంది సెట్.

పదిగజాలు యిసకలోకి నడిచి యిద్దరూ కూలబడ్డారు—క్రింద రుమాలు పరిచి ఏరియల్ ఎక్స్టెండ్ చేసి సెట్ ఆన్ చేసి ట్యూన్ చేసింది.

చక్కని జాజ్ సంగీతం వస్తోంది ఏదో స్టేషన్ నించి. ప్రకృతి నాట్యానికి తాళం వేస్తూందా సంగీతం.

కొద్ది నిమిషాలు మౌనంగా గడిచాయి.

"నువ్వు పెళ్లి చేసుకోవా కల్యాణీ!" హఠాత్తుగా అడిగాడు మధు.

"ఏం అల్లా అడుగుతున్నారు?" కొంచెం చకిత అయింది.

"చెప్పు."

"మీరే అన్నారుగా ఘటన ఉండొద్దూ?" వేళాకోళంగా అంది.

"వేళాకోళం కాదు కల్యాణీ—"

"నన్నెవరు చేసుకుంటారు—నా డబ్బు కోసం తప్ప." యింకా వేళాకోళంగానే అడిగింది.

చటుక్కున తపతి రెండు చేతులూ తన చేతులలోకి తీసుకుని "నీ తప్పొప్పులన్నిటితోను నిన్ను నేను స్వీకరిస్తాను కల్యాణీ—" అన్నాడు ఆవేశంతో తడబడే కంఠంతో.

"ఇంచుమించు యిలాటి మాటలే కనీసం నేను యాక్టు చేసిన ఆరు పిక్చర్లలో విన్నాను" పెదాలు బిగించి నవ్వుతూ అంది చేతులు వెనక్కి తీసుకోకుండానే.

"నిజం కల్యాణీ —" రెట్టించాడు మధు సీరియస్‌గా.

"నా డబ్బంతా ఏ శరణాలయానికో పంచి పెట్టేసినా?-" విచిత్రమైన నవ్వుతో అంది.

మౌనం వహించాడు మధు.

"ఊరుకున్నారేం?"

"నిజమని నమ్మించడం కష్టం-ఇంకా ఓపెన్‌గా చెప్పెయ్యాలంటే నిన్ను నమ్మించుకోవడమే కష్టం."

"మీరంత కష్టపడొద్దు లెండి - ఇదంతా పంచి పెట్టేసి దారిద్ర్యాన్ని కొనితెచ్చుకునేటంత మూర్ఖురాల్ని కాదు" పకపకా నవ్వేసింది.

"కాని యిన్నిటి మధ్య నువ్వు పొందే సుఖం ఏమిటి? ఎవరికోసం యీ సంపాదనా నిరంతర శ్రమాను?"

"ఒక్కొక్కప్పుడు నాకూ అల్లాగే అనిపిస్తుంటుంది."

"అటువంటి అప్పుడు యీ జీవితాన్ని ఎందుకు వదిలెయ్య కూడదు? ఇప్పటికి ఆర్జించిన దానితో ఎందుకు సంతృప్తిపడి సుఖ జీవనాన్ని సాగించ కూడదు?"

"ఎందుకా? - నా బాంక్ ఎక్కౌంటు ఎంత ఉంటుందనుకుంటున్నారు?"

"కనీసం ఏడెనిమిది లక్షలు."

"కాదు - కేవలం రెండు లక్షల చిల్లర-మరి మా యింటి ఖర్చు నెలకి ఎనిమిదివేలు - ఎన్నాళ్లొస్తుందీ రెండు లక్షలు?"

"యీ జీవితం వదిలేస్తే యింత కర్చెందుకు?"

"ఒక స్థాయికి అలవాటుపడ్డ జీవితం గబుక్కున మారదు విధి ఎదురైతే తప్ప. అప్పటికీ అది భరించలేక నిస్పృహచెంది ఆత్మహత్య చేసుకున్నవాళ్లనీ, పిచ్చెత్తినవాళ్ళనీ ఎరుగుదున్నేను. తొరగా నేనెంత కాలం నెలుగుతానో నాకే తెలీదు. వరసగా రెండు పిక్చర్సు ఫైలైనా- నేను విపరీతంగా లావెక్కిపోయినా నా వయస్సు ముదిరినా - వీటిలో ఏ ఒక్కటైనా నా విలువని తగ్గించేస్తుంది. దీపం ఉండగానే యిల్లు చక్కపెట్టుకోవాలి నేను."

"ఇలా సౌఖ్యాన్ని వాయిదా వేసుకుని యింకా తరువాత అనుభవించేదేమిటి?"

"మీరు పైన చెప్పినవి కొన్ని కారణాలే— అన్నింటికన్న ముఖ్యమైందింకోటుంది. ఇంత శ్రమకు అలవాటుపడ్డ నా శరీరం ఎడతెగని విశ్రాంతి భరించలేదు. గట్టున పడవేసిన చాపలా అయిపోతుంది నా పని."

ఇన్ని గంటల ప్రవర్తనలో మొట్టమొదటిసారిగా ఆమెలో సీరియస్‌నెస్ కనిపించింది.

అయినా మధు కెందుకో ఆ వాదన నచ్చలా-

"కాని నువ్వు పెళ్లి చేసుకోవాలి కల్యాణీ-నన్ను కాకపోతే మరొకర్ని."

"మీరింకా ఉంటారుగా. తరవాత మాట్లాడుకుందాం. అప్పుడే చీకటి పడింది కూడాను. లేవండి" అంటూ లేచి రేడియో ఆఫ్‌చేసి నిలబడింది.

దశమి వెన్నెలలో ప్రకృతి మరింత సౌందర్యంగా వుంది. అక్కడక్కడ దూది పింజలలా మబ్బులు. మిణుకు మిణుకుమంటూ రంగులు మార్చుకునే తారలు.

తెలుపు, ఆకుపచ్చ, ఎరుపు రంగు లైట్లుమాత్రమే కనబడుతూ సముద్రపు హోరుకు శృతిగా శబ్దం చేస్తూ పోతోందో విమానం.

తిరుగు ప్రయాణంలో యిద్దరూ యించుమించు నిశ్శబ్దంగానే ఉన్నారు.

తరువాత రెండు రోజులలో మధు తలంపులో ఎన్నో మార్పులు వచ్చాయి.

ఆప్యాయత కనబడే యీ వాతావరణం తాను భరించలేకపోయాడు. పుస్తకాలమీద విసుగెత్తింది. ఎవరితో మాట్లాడదామన్నా ఎవరూ వుండరు. తనకి పనీ లేదు తీరుబడీ లేదు. అందరూ సన్నిహితంగా మెలిగినా తాను మాత్రం పరాయివాడిగానే ఫీలవుతున్నాడు.

తను అనుభవిస్తున్న సౌఖ్యాలన్నీ తాను స్వయంగా ఆర్జించుకున్నవి కావు. ఎవరివల్లో తనకు ఆపాదింపబడ్డవి.

అంత ఖరీదైన కారులో ప్రయాణిస్తుంటే తనకి కలుగుతున్నది సౌఖ్యం కాదు - అడుగడుగునా అది తపతి కారనీ, కేవలం తనమీది మక్కువకొద్దీ వాడుకోమందనీనూ. ఒకవేళ అది తన స్వంతానికే వాడుకోమని ఆమె యిచ్చేసినా యీ భావమే వస్తుందేమో.

ఆ వాతావరణం మొహం మొత్తింది. తను ఆ పరిస్థితులకి ఫిట్ కాడు. ఇదొక అపరంజి పంజరంలాగుంది.

తన ఉద్యోగంలో తన కొద్ది సంపాదనలో 'తన' అని ముద్రవేసుకున్న భావం తనకెంతో అధికారాన్ని, దర్పాన్ని యిస్తుంది - అక్కడ తనకో యిండివిద్యువాలిటీ వుంది -

తనెంత సహజంగా ఉండ ప్రయత్నించినా యిక్కడ పొసగటం లేదు.

ఇక్కడ తనకున్న రిలీఫ్ అల్లా ఒక్క కల్యాణీ- ఆమె చూపించే ప్రేమాను.

మూడోరోజు పొద్దున్నే ఎవరో తన్ని కుదిపేస్తుంటే మెలుకువ వచ్చింది.

"ఎప్పుడూ ఎనిమిది గంటలకేనా లేచేది? లేవండి- లేవండి-" ఎక్కడినించో దూరంగా ఆరంభమై దగ్గరగా వినబడుతున్నాయి మెలుకువ వచ్చేకొద్దీ.

"ఏమిటి కల్యాణీ?" మూలిగాడు బద్ధకంగా.

"అబ్బ లెమ్మంటుంటే-ఎక్కడో కుంభకర్ణుడు" నవ్వింది.

తప్పక లేచాడు మధు.

ఆరైనా కాలేదు - వీధులోకి సిద్ధంగా ముస్తాబై వుంది కల్యాణి. ప్రాతఃకాలపు వెలుగులో స్నిగ్ధదీప్తితో ప్రకాశిస్తున్న దామె ముఖం. ఇంకా రోజు ప్రారంభమే కావడంవల్ల పని చేసిన అలసట కనబడని ముఖం కొత్తగా తోచింది మధుకి.

"ఏమిటలా తినేసేలా చూస్తారు? భయం వేస్తోంది బాబూ!" చటుక్కున భీతహరిణేక్షణ అయిపోయింది.

ఏ భావాన్నైనా అంత సెకండ్లలో, అతి సహజంగా ఎల్లా నటించగలదో!

"ఎందుకు లేపేశావు కల్యాణీ?"

"షూటింగుకి వెళ్లాలి."

"వెళ్లు."

"కాదు మీరు కూడా రావాలి."

"నే నెందుకూ?"

"మీరివాళ వచ్చేతీరాలి."

"నేను రాను."

"రారూ!" విచిత్రంగా మారిపోయిందా ముఖం. అనునయం, చిరుకోపం, విసుగు, లాలన-ఆ భావాలని వర్ణించ తరంకాదు. కాని ఒక్క ముక్క చెప్పొచ్చు. ఆ మాట అంటున్నప్పుడామె ముఖం చూచి కాదనగలిగినవాడుంటే వాడు రాక్షసుడై వుండాలి.

"అల్లాగే" అన్నాడు మధు లొంగిపోయి.

"అదీ బుద్ధిమంతుల లక్షణం అంటే" మధురాతి మధురమైన నవ్వు ఒలకబోసింది.

అరగంట తరువాత స్టూడియో ఉద్యానంలోకి చొచ్చుకుపోయిన వారి కారు వాళ్లని ఫ్లోర్ దగ్గర దించేసి పార్కింగ్ లాట్ లోకి వెళ్లిపోయింది.

ఒక గున్నమామిడి కింద అయిదారు ఫోల్డింగ్ చైర్సు వున్నాయి. నలుగురు వ్యక్తులు కూర్చుని ఉన్నారు.

నల్లగా లావుగా తెల్లని గ్లాస్కోపంచ గూడ కట్టు తెల్లని షర్టు వేసుకున్నాయనొకడు, సెమిసూట్, టైలలో యింకొకడు, మేకప్ తో కూర్చున్న అమ్మాయి, ముసలి మేకప్ లో వున్న యువకుడు.

"రామ్మా కూర్చో-" ఆదరంగా తపతిని పిల్చి మధుకేసి అపరిచిత దృష్టితో చూసి "కూర్చోండి" అన్నాడు ఆ నల్లటి లావాటి వ్యక్తి తపతితో వచ్చిన మధుకి గౌరవంయిస్తూ.

"ఈయన మధు అని నాకు చాలా సన్నిహితులు, ఈయన ప్రొడ్యూసర్, వారు అసిస్టెంట్ డైరెక్టర్ రావు, యీమె శశి పిక్చర్లో నాకు రైవల్—వీరు శంకరంగారని నా తండ్రి పిక్చర్లో—" నవ్వుతూ

వరసగా ఆ లావాటాయన్నీ, సెమీనూటతన్నీ మేకప్‌లో ఉన్న యిద్దర్నీ పరిచయంచేసింది తపతి...

పరస్పర అభివాదాలు చెప్పుకున్నారు.

"అన్నీ పూర్తయినట్లేనా ?" తపతి ప్రొడ్యూసర్ని అడిగింది.

"ఎక్కడమ్మా—ఆ రైటరుగారు రాత్రి రెండింటికి మొదలుపెట్టాడు డైలాగుల రీరైటింగ్—ఇప్పటికి రాలేదు స్క్రిప్టు—ఏ క్షణానికైనా వచ్చేస్తుంది—ఏమని చెప్పను మా పాట్లు. రాత్రి పదింటిదాక సెట్టు వెయ్యడం అవనేలేదు. పెయింట్ యింకా ఆరుతూనే ఉంది.—ప్రొడక్షన్ అంత ఛండాలపుపని అదేగాని యింకోటిలేదు.—" ఉస్సురన్నాడాయన.

"ఏవో వస్తూనేఉంటాయి—పిక్చర్ బాక్సాఫీస్ అయితే పాపం కమ్మగా ఉంటుందేం ? అప్పుడివన్నీ జ్ఞాపకం ఉంటాయా ?" నవ్వుతూ అడిగింది తపతి.

"నీకు తెలీందేముందీ—కలక్షన్లలో మా చేతికొచ్చేది అయిపోవంతే—ఒక్కటి చెప్తాను వినమ్మా—ప్రొడ్యూసర్ బాగుపడ్డు ఎప్పుడూ.—ఏదో యిందులో యిరుక్కున్నాం గనక గబుక్కున ఎక్కడికీ పోలేక గానీ—"

"అబ్బ ! ఏం చెప్తారు కబుర్లు ?" శశి అంది.

"ఏం చెప్పినా అల్లాగే ఉంటుంది మీకు—" అన్నాడు ప్రొడ్యూసర్.

"ఇవాళ సీక్వెన్స్ ఏమిటి డైరెక్టరుగారూ." తపతి సెమీనూటతన్ని అడిగింది.

"మీరూ హీరోగారూ విలాసంగా విహరిస్తూ ఆయన పాడుతుంటే మీరు ఆడుతుంటారు. హీరోని వెతుక్కుంటూ వచ్చిన మీ రైవల్ చూసి కళ్ళుకుట్టి మీ తండ్రికి చెప్పి అతన్ని తీసుకువస్తుంది. మీ రిద్దరూ ఒకరి కౌగిలిలో ఒక రుండగా చూసిన అతను మండిపోయి, నిప్పులుచెరిగే కళ్ళతో 'గారీ' అని ఒక్క పొలికేక పెడతాడు. తిరువాత డైలాగులు—మిమ్మల్ని చెంపమీద ఒక్కటంటించి బరబర లాక్కుపోవడం—యిత్యాదులు—" నవ్వుతూ అని లేచి ఇటు అటు నాలుగడుగులు వేసి ఫ్లోర్‌లోకి తుర్రుమన్నాడు.

"నేను మేకప్ కానిచ్చివస్తాను-ఒక్కక్షణం—ఉంటారుగదూ." అని మధుతో అని తపతి గ్రీన్‌రూం వైపు వెళ్ళింది.

పావుగంటలో తయారై వచ్చిన తపతినిచూస్తే కొంచెం కంపరం కలిగింది మధుకి.

మోకాళ్లకిందికి సగందాకానే వచ్చే పరికిణీ, బిగించికట్టిన పొట్టిరైక, వక్షానికి మధ్యనించి కుడిభుజం మీదుగా వీపుమీద క్రాస్‌గా తిరిగి ఎడంవైపు పరికిణీలోకి బిగించబడ్డ వలెవాటు—ముఖానికి ఎర్రనిరంగు, పెదవులకి లిప్‌స్టిక్, నుదుట బొట్టు, కనుబొమ్మల్ని పొడిగిస్తూ నల్లరంగు పెన్సిల్ గీతలు—

చాలా సహజంగా వచ్చి తన సీట్‌లో కూర్చుంది మధుపక్కన.

ఆమెనా దుస్తుల్లో యితర్లు చూడ్డం మధు వంటిమీద తేళ్లు జెర్రిలు పాకించింది.

ఇక వాళ్ళ మాటలమీద దృష్టి ఉంచలేకపోయాడు.

ఇంతలో భావకవి దుస్తుల్లో, నుదుటిమీదకు ముంగురులు పడుతూండగా రంగులలో ప్రత్యక్షమైనాడు హీరో.

వస్తూనే తపతిదగ్గరకెళ్ళి—

"పిల్లా బల్‌బలేగున్నవే!" తెచ్చిపెట్టుకున్న యాసతో మాట్లాడుతూ నవ్వుతూ అన్నాడు.

"ఏం సెట్టుబయటే ఏక్ట్ చేద్దామనిపిస్తోందా ?"

"పిట్టకూతట్టిందే !—" మోచేత్తో తపతి వెన్నుమీద పొడిచాడు.

"ఏమిటామోటుసరసం !" కిలకిలా నవ్వుతూ అంది తపతి.

ఆ హీరోతో తపతి ఎన్నో పిక్చర్లలో నటించింది. ఆ కారణంగానే సెట్టుమీదే కాకుండా వెలుపలకూడా ఎంతో చనువుగాను, ఫ్రీగానే ఉంటారు.

కాని ఆ దృశ్యం మధు మనస్సుని యీసుతో నింపింది.

మధు హీరో పరస్పరం పరిచయం చెయ్యబడ్డారు.

హీరో సహజంగానే కలుపుగోలుతనం ప్రదర్శించినా మధుమాత్రం నటించలేక అవస్థపడ్డాడు.

ఒక ముప్ఫైఏళ్లవ్యక్తి వచ్చి అందర్నీ పలకరించాడు. మధుకి ఆయన డైరెక్టర్‌గా పరిచయం చెయ్యబడ్డాడు.

"లోపలంతా రెడీగా ఉంది — స్క్రిప్టు వచ్చిందా ?" ప్రొడ్యూసర్ని అడిగాడు డైరెక్టర్.

"ఇంకా లేదు - గంటక్రితం ఫోన్‌చేస్తే ఆఖరి డైలాగు రాస్తున్నాడంటారు చంద్రంగారు.—ఇప్పటికి

ఊడిపడ్డు—టిన్నులకి టిన్నులు స్టేట్ ఎక్స్‌ప్రెస్ తగలడ్డమేగాని కవిగారికి మూడ్ రాదు—మనకీ చావు—" విసుక్కున్నాడు ప్రొడ్యూసర్.

"పోనీమళ్లీ—ఆ అదిగో చంద్రంగారు. వచ్చేస్తున్నాడు." డైరక్టర్ అన్నాడు దగ్గిరకొస్తున్న కారు చూసి.

కారులోంచి నిద్రచాలమిచేత ఎర్రబడిన కళ్ళు, చెదిరిన జుట్టుతో దిగిన ఒక యువకుడు డైరక్టర్‌కి కాగితాలు అందించి - "ఇప్పటికి అయింది, యింటికేనా వెళ్ళకుండా వచ్చేశాను—రాత్రల్లా మేలుకుని సేవ చెయ్యలేక నా ప్రాణం చాలొచ్చింది." అన్నాడు చంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ నంబర్ టూ.

"ఇంక పదండి అప్పుడే తొమ్మిదైపోతోంది—" అంటూ ఫ్లోర్ లోకి దారితీశాడు ప్రొడ్యూసర్.

వెలుగులోంచి లోపలికెళ్లేటప్పటికి మొదట ఏమీ కనబడలేదు. తక్కువ వెలుతురికి కళ్లు కొస్త అలవాటు పడేటప్పటికి—ఒక బ్రహ్మాండమైన సెట్—

కాన్వాస్‌మీద చిత్రించిన దూరపు కొండలు ఆకాశంలేక, అట్టలతోను మట్టితోను నిర్మించిన ఒక కొండ, దానిమీంచి జాలువారే సెలయేరు. సెలయేరు మీత చెక్కవంతెనా—చుట్టూ చెట్లుకింద పచ్చిక బయలు—

పైకి ఫ్లోర్ కప్పు—అడ్డంగా వేలాడగట్టబడి ఉన్న చెక్క నిచ్చెనలు వాటిమీద లైట్లు—టిల్ట్ చెయ్యడానికి మనుషులు—

ఒక పక్కకి దెయ్యమంతఉన్న స్టాండ్‌కి మైక్ - దానినించి కేబిల్స్—దీపాలన్నిటికీ స్విచ్ బోర్డునుంచి కనెక్టింగ్ కేబుల్స్—ఇంకో మూలకి కామెరా, ట్రాలీ. ఇక్కడ యిద్దరు మనుష్యులు—రెండు ఎయిర్ సర్క్యులేటర్లు—

సెట్ యింత గందరగోళంగా ఉంటుందని మొదటె సారిగా తెలిసింది మధుకి.

డైరెక్టర్‌గారు మొదలు పెట్టారు "తపతిగారు, మీరు అటు కొండమాటునించి సెలయేటి దారమ్మటే చురుగ్గా గెంతుకుంటూ బ్రిడ్జిమీద కొస్తారు—'గౌరీ' అని పిలుపు వినబడుతుంది—నలుదిక్కులా పరికిస్తారు- అక్కడ హీరోగారు కనబడతారు—చిరునవ్వు చిరుసిగ్గు వస్తుంది మీ ముఖంమీదికి—ఆగుదామా మానదామా అని సందేహిస్తుంటారు—తిరువాత వెళ్లడానికే నిశ్చయించి కదిలి పోబోతారు—పాట ప్రారంభమౌతుంది—నిలిచిపోతారు—మెల్లిగా కదులుతూ శేఖరంగారికేసి నడుస్తారు స్వప్నంలోలాగ—వెళ్ళి ఆయన గుండెలమీదఆని తల పైకెత్తి ఆయన కళ్లల్లోకి రిప్రోచ్‌ఫుల్ గా చూసి కుడిచేతి వేళ్లు ఆయన పెదవులకు తాటించి పాట ఆపేస్తారు—ఇక శేఖరంగారు—"

"పాట రాసుకుందుకువచ్చిన నేను దూరాన గౌరినిచూసి ఆమె బ్రిడ్జిమీదికి రాగానే మృదువుగా 'గౌరీ' అని పిలుస్తాను, ఆహ్వానించే కళ్లతో—చిరునవ్వుతో—పులకించిన దేహంతో—ఆమె రారు—పాట ఎత్తుకుంటాను-ఆమె వచ్చినా నోరు మూస్తుంది-అంతేగా" నవ్వాడు హీరో—

"అయితే ఏది—ఒక్క రిహార్సల్—రాజా సాబ్ లైటింగ్—" కెమెరా డైరక్టర్‌ని ఉద్దేశించి అన్నాడు.

ఆయన బుల్లెట్ షాట్స్‌లాగ "వన్‌ఆన్—సిక్స్ ఆన్—టెన్ అన్—"డైరెక్షన్ యిచ్చాడు.

టకటక వెలిగిపోయాయి లైట్లు—

సెట్టంతా వెలుతురుతో పటపగలైపోయింది.

తపతి సెట్టు మూలకెళ్ళి—కొండపక్కనించి ఏటివారే గెంతుకుంటూ వచ్చి బ్రిడ్జ్‌ఎక్కి మధ్యకి వచ్చేసరికి 'గౌరీ' అని పిలుస్తాడు హీరో—

తపతి ఆగిపోయి కళ్ళు మిలమిలలాడించి చుట్టూ గబగబ కలయజూసి, హీరో కనబడగానే క్షణాలమీద చిరునవ్వు, ముఖంమీద చిరుసిగ్గు తెచ్చుకుని రెండు క్షణాలు తటపటాయించి అడుగు ముందుకేస్తుంది.

"లలిత లలిత సరసీరుహ సన్నిభ అంజనశోభిత ధవళాక్షీ!" మోహనరాగంలో ఎత్తుకుంటాడు హీరో.

నిలిచిపోతుంది తపతి. తరువాత మెల్లి మెల్లిగా అడుగులు వేస్తూ హీరోవేపు సాగిపోతుంది. పాట కంటిన్యూ అవుతూంటుంది—

"వినీలకుంతల విరాజమాళీ - బింబాధరీ చంద్ర బింబాననా—నవలావణ్య సుమనోజ్ఞసౌందర్య గాత్రీ-"

ఆవేళకు అతని గుండెల కానుకుని తల ఎత్తి అతని కళ్ళల్లోకి రిప్రోచ్‌ఫుల్ గా చూస్తూ చేతివేళ్ళతో అతని పెదవులు మృదువుగా తాకి పాట ఆపేస్తుంది—

సంతోషంతో వెలిగే కళ్లతో ఆమెను చూస్తూ తన చేతితో ఆమెను చుట్టివేస్తాడు హీరో.

"Excellent let us start" అన్నాడు డైరెక్టర్.

తపతి కొండమాటు కెళ్ళింది.

"రాజా సాబ్—"

"ఓకే బై మీ" జవాబు వచ్చింది.

"పాన్స్ ఆఫ్ - సైలెన్స్ - క్లాప్—"

క్లాప్ కొట్టి తప్పుకున్నాడు బోయ్—తపతి వస్తూ బ్రిడ్జి మీద గోప్పు తగిలి చతికిలబడింది—

"కట్ - కట్ -" అరిచాడు డైరెక్టర్—

ప్రొడ్యూసర్, డైరెక్టర్ - తపతి దగ్గర కెళ్లారు కంగారుగా—

"అబ్బే—ఏం లేదు—జస్ట్ కాలుజారింది" అంది తపతి లేస్తూ.

"దెబ్బేం తగల్లేదుగదా — రెస్టు తీసుకుంటా వామ్మా—" ఆదుర్దా వ్యక్తపరిచాడు ప్రొడ్యూసర్.

"అబ్బే అక్కర్లేదు—"

మళ్లా మొదటికొచ్చింది షాట్—

ఆవాళ షూటింగ్ ముగిసేటప్పటికి రాత్రి పదకొండు అయింది.

హీరో హీరోయిన్ల రొమాన్సు చూసిన మధు మనస్సు యీర్ష్యతోను, జుగుప్సతోను నిండిపోయింది. ఉండలేకా, వచ్చెయ్యలేకా యిరుకున పడిపోయాడు.

"ఎల్లా ఉంది షూటింగ్—నా యాక్షనో?" అడిగింది తపతి దార్లో కార్లో—

"అమోఘంగా ఉన్నాయి—" ఇంకేం అనలేక అన్నాడు మధు.

ఇంటికొచ్చింతరువాత దగ్గర కూర్చుని మధు చేత అన్నం తినిపిస్తూ ఇవాళ్ళెల్లా మిమ్మల్ని నానా అవస్థ పెట్టాను—బోరెత్తి పోయినట్టున్నారు-అలవాటుపడ్డ నేనే బోరెత్తిపోతుంటాను. పిక్చర్లో మూడు నిమిషాలు నిలిచే ఘట్టానికి యిక్కడ ఒక డబుల్ కాల్ షీట్ చాలదు— ఇవాళింకా నయం—ఒక్కో రోజు తీసింది ఎడిటింగ్‌లో కత్తిరై పోవడమో—నాలుగు రీటేక్స్ కావడమో జరుగుతుంది"—

చతుర్దశి చంద్రుడి వెన్నెట్లో బాల్కనీమీద కూర్చున్నారిద్దరూ—

ప్రకృతి చల్లగా హాయిగా ఉంది—

మౌనంగా గడుస్తున్నాయి క్షణాలు—

"ఏమండీ—"మృదువుగా పిల్చింది తపతి—

"ఊఁ" మూలిగాడు మధు.

"అల్లా ఉన్నారేం?"

"ఎల్లా ఉన్నాను?"

"బాధ పడుతున్నట్టు—"

"లేదే—"

"నా కళ్లలోకి చూసి నిజం చెప్పండి."

తపతి కళ్ళలోకి చూశాడు మధు—బాధ గూడు కట్టుకుని ఉందతని ముఖంలో—

"ఇవాల్టి సంఘటనలే మిమ్మల్నింత కలత పెట్టాయే—ఇంక నన్ను పెళ్ళిచేసుకుని మీరేం సుఖపడతారు?—ఇక నామాట—కృత్రిమాలకి అలవాటు పడ్డ నా మనస్సు రిలీఫ్ కోరుతుందేగాని యీ వాతావరణాన్ని పూర్తిగా విడిచిపెట్టనియ్యదు— నేను పెళ్ళి చేసుకుని నేనూ సుఖించలేను—చేసుకున్నవారిని సుఖపెట్టలేను—అందుకే మీరంత ప్రేమతో నన్ను స్వీకరిస్తానన్నా అవునన లేకపోయాను—" మృదువుగా లాలించే కంఠంతో అంది—

"నిజమే కల్యాణీ నువ్వన్నది—"అని ఆగి "కాని నే నిక్కడ ఉండలేను" అన్నాడు మధు.

"అది నాకూ తెలుసు—అందుకే మిమ్మల్ని వత్తిడిపెట్టలేను—కాని తీరిక చిక్కినప్పుడల్లా కనబడుతుంటారా?—" మొదటిసారిగా ఆమె కళ్ళల్లో నీళ్లు నిల్చాయి—

మధు కరిగిపోయాడు—

ఆమెను కౌగిలిలోకి తీసుకుని కళ్లుతుడిచి—

"ఛా! ఎందు కేడుస్తావు కల్యాణీ—తప్పకుండా తీరికైనప్పుడల్లా వస్తానని మాటిస్తున్నాను—"

మధు గుండెలకు తల ఆన్చి నిశ్శబ్దంగా ఏడ్చింది తపతి అనే కల్యాణి.